విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

శనివారం 26 అక్టోబరు 2024 | 8 పేజీలు

అర్జీల రీ ఓపెన్‌కు తావు లేకుండా సకాలంలో

పరిష్కారం చేయాలి

– జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ప్రతి అర్జీని ఆడిట్ చేస్తామని, నిర్దేశిత కాలం లోపు సమస్యలకు పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు.

2

కంచి రాజేంద్ర కుటుంబానికి

అండగా ఉంటాం

– ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి

విశాలాంధ్ర-తొట్టంబేడు: శ్రీకాళహస్తి మండలం దొమ్మరపాళెం వద్ద ఇసుక ట్రాక్టరు ఢీ కొని మృతి చెందిన కంచి రాజేంద్ర కుటుంబానికి అండగా ఉంటామని స్థానిక శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి హామీ ఇచ్చారు. తొట్టంబేడు మండలం చియ్యవరంలో శుక్రవారం ఆయన కంచి రాజేంద్ర కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ కుటుంబానికి భగవం తుడు మనోధైర్యం ప్రసాదించాలని ఆయన కోరుకున్నారు. రాజేంద్ర భార్య గురవమ్మకు రూ.50వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి మాట్లాడుతూ... ఇసుక ట్రాక్టరు ఢీకొని కంచి రాజేంద్ర, ఆయన కుమారుడు చైతన్య దుర్మరణం చెందడం బాధాకర మన్నారు. రాజేంద్ర పిల్లలను చదివించే బాధ్యత తీసుకుంటామన్నారు. మృతుని కుటుంబానికి ప్రభుత్వం నుంచి పరిహారం... ఒక ఎకరం భూమి ఇచ్చేటట్లు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఇక మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూదన్ రెడ్డి దీనిని శవ రాజకీయం చేయాలని చూస్తున్నాడని బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి ఆరోపించారు. ఎక్కడో బెంగళూరులో కూర్చుని పిచ్చి వీడియోలు వదలుతున్నారన్నారు. బాధిత కుటుంబాన్ని పరామర్శిం చాల్సింది పోయి వారిని మరింత క్షోభకు గురి చేసే విధంగా బియ్యపు మధు వ్యవహరిస్తున్నాడన్నారు.

2లో

ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో...

ప్రసూతి మరణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి

ప్రసూతి మరణాలకు బాధ్యులుగా తేలితే చర్యలు తప్పవు: కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్

విశాలాంధ్ర- తిరుపతి : ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో ప్రసూతి మరణాలు జరగకుండా చూడాలని, అన్ని ఆసుపత్రుల్లో ప్రసవ సమయంలో తప్పనిసరి డెలివరీ ప్రోటోకాల్ పాటించాలని, ప్రసూతి మరణాలకు బాధ్యులుగా తేలితే చర్యలు తప్పవు అని జిల్లా కలెక్టర్ డా. ఎస్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలో

2

ర్యాగింగ్ భూతాన్ని జయిద్దాం

– తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు

విశాలాంధ్ర-తిరుపతి : శ్రీ వేంటేశ్వర విశ్వవిద్యాల యంలో విద్యార్థి సంక్షేమ, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ర్యాగింగ్‌పై విద్యార్థులకు "ర్యాగింగ్ పట్ల జాగృతి" కార్యక్ర ˘మం నిర్వహించబడింది. ఈ కార్యక్ర మంలో ముఖ్య అతి థిగా పాలొన్న తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బ రాయుడు మాట్లాడుతూ సీనియర్ జూనియర్ అయిన విద్యార్థినీ విద్యార్థులు ర్యాగింగ్ పట్ల జాగ్రత్తగా ఉండాలని ముఖ్యంగా ర్యాగింగ్ అనేక జీవితాలను ఛిద్రం చేస్తుందనీ, దీనికికఠినమైనటువంటి శిక్షలు ఉన్నాయన్నారు.

2

తిరుమలలో టీటీడీ ఈవో విస్తృత తనిఖీలు

విశాలాంధ్ర - తిరుమల కల్చరల్: టీటీడీ ఈవో జె.శ్యామలరావు అడిషనల్ ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరితో కలిసి శుక్రవారం తిరుమలలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ముందుగా వకుళామాత కేంద్రీయ వంటశాలను పరిశీలించిన ఈవో నూతనంగా నిర్మిస్తున్న పీఏసీ-5ను తనిఖీ చేశారు. అక్కడ పనుల పురోగతి గురించి ఇంజినీరింగ్ అధికారులతో ఆరా తీశారు. అనంతరం కౌస్తుభం, సప్తగిరి, ఎస్ఎంసీ, షాపింగ్ కాంప్లెక్స్ వద్ద హొటళ్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం శిలా తోరణం వద్దకు చేరుకుని తనిఖీలు చేపట్టారు. ఔటర్ రింగ్ రోడ్డులో భక్తుల సౌకర్యార్థం టీటీడీ నిర్మిస్తున్న నూతన క్యూలైన్లు, మరుగుదొడ్లు, ఫుడ్ కోర్టులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సిఈ సత్య నారాయణ, ఈ ఈ లు వేణు గోపాల్, సుబ్రహ్మణ్యం, డీ ఈ చంద్రశేఖర్, ఎస్టేట్స్ అధికారి వెంకటేశ్వరులు, డిప్యూటీ ఈఓ (హెల్త్) ఆశాజ్యోతి, హెల్త్ అధికారి డా. మధుసూదన ప్రసాద్, వీజీఓ సురేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పరిష్కారం చేయాలి

విశాలాంధ్ర – కుప్పం: కుప్పం నియోజకవర్గానికి సంబంధించి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ కుప్పం ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమ అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ జి. విద్యాధరి, కడ ప్రాజెక్టు అధికారి వికాస్ మర్మత్ లతో కలసి కుప్పం నియోజకవర్గ అధికారులతో పి జి ఆర్ ఎస్ లో అందిన అర్జీల పరిష్కారం పై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కుప్పంలో గతంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలలో ఇంకా కొన్ని పరిష్కారం కాలేదని, అర్జీల పరిష్కారానికి అధికారులకు సమయం ఇవ్వడం జరుగుతుందని, నిర్దేశిత కాల సమయంలోపు పరిష్కరించాలని అన్నారు. సమస్యల పరిష్కారం లో భాగంగా ఎంక్వయిరీ, సర్వే, క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయాలని, అవసరం అయితే ఉన్నతాధికారికి బదలాయించడం చేయాలన్నారు. పి జి ఆర్ ఎస్ ద్వారా అందిన ప్రతి అర్జీని ఆడిట్ చేస్తామన్నారు. అర్జీదారులలో కొంత మందికి నేరుగా ఫోన్ చేసి సమస్యల పరిష్కారం పై ప్రజా స్పందన తెలుసుకుంటామన్నారు. గ్రామ సచివాలయాలలో సిబ్బంది హాజరును ఎంపీడీఓ లు పర్యవేక్షించాలన్నారు. సచివాలయాలకు వచ్చే ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. సమస్యలతో వచ్చే ప్రతి అర్జీదారుని సమస్యను సావధానంగా విని పరిష్కరించడానికి వీలుపడే వాటికి సత్వర పరిష్కారం చూపాలని, పరిష్కరించబడని సమస్యలకు సంబంధించి వివరాలను అర్జీదారునికి పూర్తిగా తెలియజేయా లన్నారు. జిల్లా స్థాయిలో పరిష్కరించే అంశాలను జిల్లా సచివాలయాలకు పంపినట్లైతే పరిశీలించడం జరుగుతుందన్నారు. అర్జీల రీ ఓపెన్ కు తావు లేకుండా నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. రీసర్వే, ఫ్రీ హోల్డ్ వెరిఫికేషన్, మ్యూటేషన్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఈ సమీక్షలో ఆర్టిసి వైస్ చైర్మన్ మునిరత్నం, జెడ్పి సిఈఓ రవికుమార్ నాయుడు హౌసింగ్ పీడీ పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉంటాం

(మొదటి పేజీ తరువాయి) రాజేంద్ర, చైతన్య మరణానికి కారణమైన ట్రాక్టర్ వైసీపీ నాయకుడిదన్నారు. ప్రమాదానికి కారణమైన వారిపై చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈయన వెంట టీడీపీ నేతలు రావిళ్ల మునిరాజా నాయుడు, చెంచయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు. కాగా రాజేంద్ర కుటుంబ సభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డితో మాట్లాడుతూ... రాజకీయాలకు మాకు ఎటువంటి సంబంధం లేదన్నారు. కావాలనే కొందరు దీనిని రాజకీయం చేస్తున్నారన్నారు. తమ కుటుంబానికి అండగా ఉండాలని ఆయనకు విజ్ఞప్తి చేశారు.

ప్రసూతి మరణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి

(మొదటి పేజీ తరువాయి) జూన్ 2024 నుండి సెప్టెంబర్ 24 వరకు జరిగిన ప్రసూతి మరణాలపై సంబంధిత కుటుంబ సభ్యులతో, చికిత్స అందిందించిన డాక్టర్లు , అంగన్ వాడి, ఎ.ఎన్.ఎం. ఆశాలతో జిల్లా కలెక్టర్ మరియు మెటర్నల్ డెత్ సర్వేలన్స్ రెస్పాన్స్ కమిటి అధ్యక్షులు డా.ఎస్. వెంకటేశ్వర్ అధ్యక్షతన ఆడిట్ నిర్వహణ జరిగింది. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నపాటి పొరపాటుకు తావులేకుండా ప్రసవ సమయంలో నియమావళి మేరకు వైద్యపరీక్షలు జరిపి తల్లి, బిడ్డ క్షేమానికి ప్రాధాన్యత నివ్వాలని అన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులల్లో జరిగే మాతృ మరణాల పై సంబందిత బంధువులు వివరణ పరిగణలోకి తీసుకుంటామని , నిర్లక్ష్యం వహించిన వారిపై తప్పనిసరి చర్యలు ఉంటాయని అన్నారు. గర్భవతి నుండి ఆమె ఆరోగ్యం కోసం అంగన్వాడి పోషకాహారం అందించడం, ఎ.ఎన్.ఎం. ప్రతినెల ఆసుపత్రికి తీసుకువెళ్ళి పరీక్షలు నిర్వహించి అనీమియా వంటివి లేకుండా చూడటం, ఆశాలు వారు సరైన సమయానికి చికిత్స పొందుతున్నారా లేదా చూడాలని అన్నారు. ఒక మరణం జరిగితే ఆశా నుండి ప్రసవ సమయంలో వున్న డాక్టర్ వరకు భాద్యత వహించాల్సి వుంటుందని , నిర్యక్ష్యంకు తావు ఇవ్వరాదని, ఇది వారి ప్రాణానికి సంబంధించిన అంశం అనేది గుర్తుంచుకోవాలని అన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రసూతి ప్రోటోకాల్ మేరకు అన్ని వసతులు, డాక్టర్లు అందుబాటులో వుండాలని అన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో ప్రసవ సమయంలో ఇబ్బందులు తలెత్తితే ప్రభుత్వ హై రిస్క్ టీం కు సమాచారం అందించాలని సూచించారు. మరణించిన వారి బంధువుల అభిప్రాయం మేరకు ఎవరి వద్ద తప్పు జరిగింది? అంగన్ వాడిల నుండి పౌష్టికాహారం అందకనా ? ఎ.ఎన్.ఎం. ప్రతినెలా సరైన సూచనలు ఇవ్వకనా? డ్యూటీ డాక్టర్లు, ప్రసవ సమయంలో వున్నా డాక్టర్లు సరైన చికిత్స ఇవ్వకనా? అనేవి రికార్డులతో పరిశీలించి చర్యలు తీసుకోనున్నామని అన్నారు. జూన్ 24 నుండి సెప్టెంబర్ 24 వరకు మరణించిన 4 మాతృ మరణాలకు చెందిన బందువుల స్టేట్ మెంట్ ను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ లక్ష్యం జీరో మరణాలని అన్నారు. అంగన్ వాడి లు, ఎ.ఎన్.ఎం.లు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుతున్న వైద్యం, సౌకర్యాలను పేదలకు వివరించాలని, అవగాహన కల్పించాలని ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు జరిగేలా చూడాలని, వారికి మెరుగైన వైద్యం అందించాలని అన్నారు. గర్భవతులు ఆరోగ్యంగా వున్నా నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా వైద్యసేవలు పొందాలని అన్నారు. ఇందులో సి ఆర్ రెడ్డి ఆసుపత్రి గూడూరు లో ఎక్కువగా సిజెరియన్ సర్జరీలు జరుగుతున్నాయని, దానిపై డిఎంహెచ్ఓ విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే అన్వేష్ ఆసుపత్రి గూడూరు లో జరిగిన మాతృ మరణంపై త్రిసభ్య కమిటీ తో విచారణ జరిపి చర్యలు తీసుకోవడానికి ఆదేశించారు. ఎస్సీ ఎస్టీ కాలనీలు, గిరిజన ప్రాంతాలు, అక్షరాస్యత తక్కువ ఉన్న ప్రాంతాల్లో ప్రజలను అంగన్వాడీ, మహిళా పోలీస్, ఆశాలు తదితరులు చైతన్య వంతులను చేయాలని అన్నారు. ఈ సమీక్షలో డిసిహెచ్ఎస్ ఆనంద మూర్తి, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిని జయలక్ష్మి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి శాంత కుమారి, అదనపు డిఎంహెచ్ఓ ఓ.శ్రీనివాస రెడ్డి, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ పార్థ సారధి రెడ్డి, ప్రైవేటు ఆసుపత్రుల డాక్టర్లు పాల్గొన్నారు.

ర్యాగింగ్ భూతాన్ని జయిద్దాం

(మొదటి పేజీ తరువాయి) అదేవిధంగా డ్రగ్స్, సైబర్ క్రైమ్ వంటి వాటి పట్ల కూడా విద్యార్థులందరూ అవగాహనతో విద్యార్థి జీవితాన్ని సాగించి మంచి భవిష్యత్తును అందుకోవాలని తెలియజేశారు. ఉపకులపతి ఆచార్య అప్పారావు మాట్లాడుతూ వర్సిటీలో అనేక ర్యాగింగ్ అవేర్నెస్ సైన్ బోర్డులను ఏర్పాటు చేయడమైనదనీ విద్యార్థులందరూ అవగాహన పెంచుకొని సహృద్భావంతో మెలుగుతూ ఉన్నత స్థానానికి ఎదగాలని చెప్పారు. వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య మాదాల భూపతి నాయుడు మాట్లాడుతూ మనిషి జీవితంలో విద్యార్థి దశ చాలా అందమైన ముఖ్య దశ అనీ, సీనియర్ విద్యార్థి తాను విద్యాలయాలలో ప్రవేశించేటప్పుడు మొదట వారు ఎదుర్కొన్న మానసిక సంఘర్షణను గుర్తు చేసుకుని, మీ తర్వాత వచ్చినటువంటి జూనియర్ విద్యార్థులకు అలాంటి ఇబ్బంది లేకుండా సోదర భావంతో వాళ్లకు మీరే పెద్దలుగా దిశ నిర్దేశం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిడిసిడి ఆచార్య ఎన్ చంద్రాయుడు మాట్లాడుతూ ర్యాగింగ్ రహిత విశ్వవిద్యాలయం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కల్చరల్ కోఆర్డినేటర్ డా.పత్తిపాటి వివేక్ మాట్లాడుతూ విద్యార్థులకు ర్యాగింగ్ పట్ల ఎలాంటి సమస్య ఉత్పన్నమైన విద్యార్థి సంక్షేమ మరియు సాంస్కృత శాఖలో వచ్చి పరిష్కరించుకోవాలని కోరారు. చివరగా ఉప కులపతి "యాంటీ - ర్యాగింగ్ ప్లెడ్జ్" నూ విద్యార్థులు అందరి చేత ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య కేటి రామకృష్ణారెడ్డి, తిరుపతి డి.ఎస్.పి శ్రీ వెంకటనారాయణ, ఆచార్య మురళీధర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. హరికృష్ణ యాదవ్, వర్సిటీ సిఐ ఎస్సై లు రామయ్య, వెంకట కిశోర్, అధ్యాపకులు, అకడమిక్ కన్సల్టెంట్లు, పరిశోధకులు, విద్యార్థిని విద్యార్థులు, పోలీస్ సిబ్బంది మరియు వర్సిటీ సిబ్బంది పాల్గొన్నారు.

పేద చిన్నపిల్లలకు ఉచిత గుండె శస్త్రచికిత్సలు

ఏ టు బి సామాజిక బాధ్యతా కార్యక్రమం: నరువి ఎండి సంపత్

విశాలాంధ్ర –తిరుపతి రూరల్ : పేద చిన్న పిల్లలకు ఉచిత గుండె శస్త్ర చికిత్సలను అడయ్యార్ ఆనంద్ భవన్ (ఏ టు బి) రెస్టారెంట్స్ సామాజిక బాధ్యతలు భాగంగా నిర్వహిం చనున్నామని నరువి హాస్పిటల్స్ ఎండి డాక్టర్ జీవి. సంపత్ తెలిపారు. శుక్రవారం వేలూరు లోని నరువి హాస్పిటల్లో చిన్నపిల్లలకు ఉచిత గుండె శస్త్ర చికిత్సలపై విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నరువి హాస్పిటల్ ఎండి సంపత్ మాట్లాడుతూ ఈ ఉచిత గుండె శస్త్ర చికిత్సలు ఐదు నుండి 15 సంవత్సరాల లోపు ఉన్న వారికి నిర్వహి స్తామన్నారు. ప్రయోగాత్మకంగా మొదటగా వేలూరు, రాణిపేట, తిరుపతూర్, తిరువన్నామలై జిల్లాలలోని ప్రజలకు ఈ శస్త్ర చికిత్సలను వర్తింపజేశామన్నారు. ఎవరైతే పేద చిన్న పిల్లలు గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారో, వారు వారి హెల్త్ రిపోర్ట్ లతోపాటు ఆ గ్రామ వీఏఓ సర్టిఫికెట్ ను తీసుకొని హాస్పిటల్‌కు రావాలన్నారు. భవిష్యత్తులో ఈ శస్త్ర చికిత్సలు మంచి ఫలితాలను అందిస్తే మరిన్ని ప్రాంతాలకు విస్తరింప చేస్తామన్నారు. త్వరలో హెల్తీ ఇండియా - హ్యాపీ ఇండియా కార్యక్రమాన్ని ప్రారంభించనున్నామన్నారు. ఇప్పటివరకు నరువి హాస్పిటల్లో 154 గుండె సంబంధిత శస్త్ర చికిత్సలను చేసామన్నారు. అడయార్ ఆనంద్ భవన్ ఎండి కె.టి. శ్రీనివాసరాజ మాట్లాడుతూ చిన్న సంస్థ నుండి ప్రారంభమై నేడు వివిధ ప్రాంతాలలో అడయార్ ఆనంద్ భవన్ బ్రాంచ్లను ఏర్పాటు చేసి ఎంతోమందికి ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. కోవిడ్ సమయంలోను ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించామన్నారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా పేదరికంలో ఉండి గుండె సంబంధిత సమస్యలు ఎదుర్కొంటున్న చిన్న పిల్లలకు శస్త్ర చికిత్సలను ఉచితంగా నిర్వహించడానికి నిర్ణయం తీసుకున్నామన్నారు. గుండె శస్త్ర చికిత్సలు చేయించుకోదలచిన వారు సిటివిఎస్ విభాగ సమన్వయకర్త పాల్ సెల్వం 87540 47796 ను సంప్రదించాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో నరువి హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పాల్ హెన్రీ, చీఫ్ ఆఫ్ మెడికల్ సర్వీస్ డాక్టర్ అరవిందన్ నాయర్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ జాకోబ్‌జోస్,సిటివిఎస్‌విభాగాధిపతిడాక్టర్‌వినాయక్ శుక్ల పాల్గొన్నారు.

దోపిడీ కేసులో నలుగురు అరెస్టు

విశాలాంధ్ర–శ్రీకాళహస్తి: దోపిడీ కేసులో నలుగురిని శుక్రవారం అరెస్టు చేసినట్లు శ్రీకాళహస్తి 1వ పట్టణ సీఐ డి.గోపి తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాళహస్తి రైల్వే స్టేషన్ సమీపంలోని హ్యాపీ కిచెన్ వద్ద ఈ నెల 19వ తేదీ సాయంత్రం పెళ్లకూరు మండలం అర్లపాడు గ్రామానికి చెందిన తరుణ్, తేజ అను యువకులు ఉండగా... శ్రీకాళహస్తి పట్టణానికి పెరుమాళ్, బాలాజీ, రాహుల్, కోమల్ అనే వారి దాడి చేసి వారి వద్ద నుంచి రెండు పోన్లు, రూ.250 నగదు దోచుకెళ్లారన్నారు. బాదితుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి... దోపిడీకి పాల్పడిన వారిని అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి నేరానికి ఉపయోగించిన రెండు మోటారు సైకిళ్ళు, బాధితుల వద్ద నుంచి లాక్కున్న ఒక %శీ% మొబైల్ ఫోను స్వాధీనం చేసుకున్నామన్నారు. కాగా పెరుమాళ్, బాలాజీ, కోమల్ అను వారు గతంలో శ్రీకాళహస్తి రూరల్ పోలీస్ స్టేషన్ పరిదిలోని ల్యాంకో వద్ద గల బీసీ కాలనీలో కొంతమంది వ్యక్తులను కత్తులతో బెదిరించి వారిపై దాడిచేసి తీవ్రముగా గాయపరచడం జరిగిందన్నారు. వీరిని అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరు పరచగా రిమాండుకు పంపారని సీఐ గోపి తెలిపారు. వీరిపై రౌడీ షీట్ తెరిచినట్లు కూడా సీఐ గోపి చెప్పారు.

నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడు

– సత్యనారాయణ రెడ్డి వ్యాఖ్యలను ఖండించిన కిషోర్ నాయుడు

విశాలాంధ్ర - చిట్టమూరు: తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు గనపర్తి కిషోర్ నాయుడు మాజీ ఎన్డిసిసి చైర్మన్ చిల్లకూరు సత్యనారాయణ రెడ్డి ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగా ప్రసాద్ పై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ సత్యనారాయణ రెడ్డి నిజం తెలుసుకొని మాట్లాడాలని కిషోర్ నాయుడు అన్నారు. సత్యనారాయణ రెడ్డి రాజకీయంలో మీరు అడుగు పెట్టింది మొదలు ఈనాటి వరకు అక్రమాలతో అవినీతి సంపాదనతో ప్రజలపై దౌర్జన్యం చేసి మీరు ఒక నాయకుడిగా ఎదిగారు అదే తెలుగుదేశం పార్టీకి సంబంధించిన కొండేపాటి గంగా ప్రసాద్ పేదలకు బడుగు,బలహీన వర్గాలకు అండగా ఉంటూ ఏ ఎన్నిక వచ్చిన ప్రజలకు నేను అండ అంటూ తన సొంత డబ్బులు ఖర్చు చేసి తన అభ్యర్థులను గెలిపించుకున్న దాఖలాలు ఎన్నో ఉన్నాయి. నిన్న మొన్నటి రోజున అధిష్టానం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో వెంకటగిరి సూళ్ళురుపేట, గూడూరు,సత్తి వేడు నియోజకవర్గాల ఎమ్మెల్యేలను గెలిపించుకున్న ఘనత కొండేపాటి గంగా ప్రసాద్ ది అని ఒక్క సూళ్ళురుపేట నియోజకవర్గంలో ఒక శాసనసభ్యులు గెలిపించుకోలేక చతికిలబడిన నువ్వు అధికారం పోయింది అన్న ఆవేశంతో ఏ విధంగా అయినా ప్రజలను రెచ్చగొట్టి భయభ్రాంతులకు గురిచేసి శవ రాజకీయాలు చేస్తున్న నువ్వు ఒక నాయకుడివా నీ ఆత్మ మీద చేయి వేసుకొని మనస్ఫూర్తిగా ఆలోచించు నిజమైన నాయకుడు ఎవరనేది నీకే అర్థమవుతుంది చిల్లర వేషాలు వేసి గత ప్రభుత్వంలో లాగా అవినీతి అక్రమాలతో నీ పాలన సాగాలంటే ఇకన సాగదని ఇది కూటమి ప్రభుత్వం తెలుగుదేశం,జనసేన,భారతీయ జనతా పార్టీ కలయికతో స్వచ్ఛమైన పరిపాలన ప్రజలకు అందిస్తూన్నారు అవినీతిపరులైన మీలాంటి వారిని రోజుకు ఒకరిని వేరువేస్తూ నీ అవినీతి భోగాతాన్ని బయటపెడుతూ ముందుకు సాగిస్తున్న కూటమి ప్రభుత్వాన్ని నీలాంటి వాళ్లు ఎన్ని నక్కజిత్తు వేషాలు వేసిన ఏమీ చేయలేరని నిన్నటి వరకు నీ వెంట ఉన్నవారే నేడు నిన్ను చీకోడుతున్నారని నీకు వయసు పెరిగింది కానీ జ్ఞానం పెరకలేదని గతంలో లాగా అవినీతి అక్రమాలకు పాల్పడాలని ప్రయత్నాలు చేస్తే నీ ఆటలు సాగవని నువ్వు జాగ్రత్తగా మసులుకోకపోతే ప్రజలే నీకు బుద్ధి చెబుతారని కిషోర్ నాయుడు హెచ్చరించారు.

వైసీపీ నేతలూ...! శవ రాజకీయాలు మానుకోండి

-టీడీపీ నేత లక్కమనేని మధు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: "వైసీపీ హయాంలో స్వర్ణముఖినది నుంచి నిత్యం వందలాది లారీల ఇసుక ఇతర రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకున్నారు. ఆ సమయంలో ఎన్నో ప్రమా దాలు జరిగాయి. అప్పటి ఎమ్మెల్యే బియ్యపు మధు కుటుంబ సభ్యులే అక్రమ ఇసుక వ్యాపారం చేసి కోట్ల రూపాయలు సంపా దించారు. అధికారం పోయాక శవ, రాజకీయాలు చేస్తున్నారు. మీ శవ రాజకీయాలు జనం నమ్మే స్థితిలో లేరు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఏది జరిగినా ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డికి అంటగట్టడం బాధా కరం. వైసీపీ నేతలు శవ రాజకీయాలు మానుకోక పోతే ప్రజలే తగిన గుణపాఠం చెబు తారు" అని తెలుగుదేశం పార్టీ నేత లక్కమనేని మధు అన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీకాళహస్తి మండలం దొమ్మరపాలెంవద్ద ఈనెల 23వ తేదీ బుధవారం రాత్రి ఇసుక ట్రాక్టరు ఢీకొని... తొట్టంబేడు మండలం చియ్యవరం గ్రామానికి చెందిన కంచి రాజేంద్ర, ఆయన కుమారుడు చైతన్య దుర్మరణం చెందితే...ఈ దుర్ఘటనకు వైసీపీ నేతలు ఎమ్మెల్యేను బాధ్యుని చేయడం ఎంత వరకు సమం జసమన్నారు. ఈ దుర్ఘటన పట్ల తెలుగుదేశం పార్టీ చింతిస్తోందన్నారు. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి పరామర్శించి రూ. 50 వేలు ఆర్థిక సాయం చేశారన్నారు. అంతేగాకుండా బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి పరిహారం, ఎకరా భూమి ఇచ్చేటట్లు చర్యలు తీసుకుం టామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారని లక్కమనేని మధు ఈ సందర్భంగా గుర్తు చేశారు. దొమ్మరపాలెం వద్ద ప్రమాదానికి కారణమైన ట్రాక్టరు వైసీపీ వారిదేనన్నారు. ఈ విషయం వారు తెలుసుకోవాలని లక్కమనేని మధు హితవు పలికారు. అవినీతి, అక్రమాలు, దౌర్జ న్యానికి మారుపేరైన మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధు సూదనరెడ్డి నేడు నీతులు వల్లించడం విడ్డూరంగా ఉందన్నారు. వైసీపీ హయాంలో ఇసుక ట్రాక్టర్లతో ఎన్ని ప్రమా దాలు జరిగాయో ఆయనకు తెలియదా అని లక్కమనేని మధు ప్రశ్నించారు. దొమ్మరపాలెం, తొట్టంబేడు, శ్రీకాళహస్తిలో బియ్యపు మధు అనుచరులు చేసిన హత్యలు గురించి అందరికీ తెలుసన్నారు. అలాంటి వ్యక్తి నేడు బొజ్జల కుటుంబంపై విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు. దశాబ్ద కాలం కిందట ఏర్పేడు పోలీసు స్టేషన్ వద్ద జరిగిన ప్రమాదాన్ని కూడా ప్రస్తుత ఎమ్మెల్యే బాధ్యుడంటూ బియ్యపు ఆరోపణలు చేయడం ఆయన దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. బొజ్జల కుటుంబం ఎపుడూ శాంతి కోరుకుంటుందన్నారు. ఈ విషయం శ్రీకాళహస్తి ప్రజలు అందరికీ తెలుసన్నారు. ప్రచారం కోసం బియ్యపుమధు,ఆయనఅనుచరులుపిచ్చిపిచ్చిమాటలు మాట్లాడటం ఇకనైనా మానుకోవాలని లక్కమనేనిమధుహితవుపలికారు.లేదంటే ప్రజలే వారికి గుణపాఠం చెబుతారన్నారు.

విద్యార్థులకు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: కార్తికేయ పీఠం ట్రస్ట్ శ్రీ షణ్ముఖ సుబ్రహ్మణ్య స్వామి వారి దేవస్థానం చెన్నై రోడ్ శ్రీకాళహస్తి వారి ఆధ్వర్యంలో ప్రతి నెలలో ఒక స్కూల్లోని విద్యార్థులకు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తొట్టంబేడు మండలం, చెబలాపురం గ్రామంలోని తమిళ్ గవర్నమెంట్ స్కూల్ నందు విద్యార్థిని విద్యార్థుల చేత హనుమాన్ చాలీసా పారాయణం చేయించి, బాల్యం నుండే దేశభక్తి కలిగి ఉండాలని, దేశం గురించి వారికి వివరించి, దేశభక్తిని పెంపొందించే విధంగా విద్యార్థులచేత చేత దేశభక్తి గీతాన్ని పాడించారు. ఈ కార్యక్రమంలో కార్తికేయ పీఠం వ్యవస్థాపకులు శ్రీ షణ్ముఖ సుబ్రహ్మణ్య స్వామి దేవస్థానం అర్చకులు పూని. మహేష్ శర్మ, శాండిల్య కుమార్, శశాంక్ కుమార్, సురేష్, ముని స్వామి, జయ కుమార్, జగదీశ్వర్ రెడ్డి, పలని రెడ్డి, లోకేష్, స్కూల్ అధ్యాపకులు పాల్గొన్నారు.

గువ్వల రమేష్ రెడ్డిని సన్మానించిన క్రీడాకారుడు

విశాలాంధ్ర-చౌడేపల్లి: తెలుగుదేశం పార్టీ మండలాధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డి (చిట్టి)ని స్థానిక ఉన్నత పాఠశాల క్రీడాకారులు ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు రాష్ట్రస్థాయిలో జరుగుతున్న టువంటి ఎస్ జి ఎఫ్ అండర్ 17 కబడ్డీ బాలబాలికల కబడ్డీ పోటీలలో జిల్లా జట్టును ఎంపిక చేశారు ఇందుకు గాను స్థానిక జిల్లా ఉన్నత పాఠశాల వేదికగా మారింది దీనికి కారకులైన తెలుగు దేశం పార్టీ మండల అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డిని ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా గువ్వల రమేష్ రెడ్డి ప్రసంగిస్తూ రాష్ట్రస్థాయిలో జరిగే కబడ్డీ పోటీలకు చౌడేపల్లి ఉన్నత పాఠశాల నుంచి సుమతి అపర్ణ హేమావతి శివకేశ వలు ఎంపిక కావడం అభినందనీయమన్నారు ఉన్నత పాఠశాలలో ఎంపికైన జిల్లా జట్టు రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రతిభ కనబర చాలని అదే స్థాయిలో దేశంలో మంచి గుర్తింపు తేవాలని ఆకాంక్షించారు ఈ కార్యక్ర మంలో ప్రధానోపాధ్యా యుడు నాగరాజు రెడ్డి ఎంపీడీవో లీలా మాధవి మాజీ ఎంపీటీసీ సభ్యుడు వెంకటరమణ సుధాకర్ రెడ్డి ఉపాధ్యాయులు మురళి రాజేంద్ర ఈశ్వర్ సుధాకర్ క్రీడాకారులు స్థానికులు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నగిరి సమీపంలోని క్వారీలను రద్దుచేయాలి

నవంబర్ 4న సిపిఐ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ముందు నిరసన దీక్ష : సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి

విశాలాంధ్ర - పుత్తూరు టౌన్ : భారత కమ్యూనిస్టు పార్టీ నగిరి నియోజకవర్గం శాఖ కార్యదర్శుల సమావేశం స్థానిక సిపిఐ కార్యాలయంలో బుధవారం సాయంత్రం వి.వేలన్ అధ్యక్షతన జరిగింది సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్ నాగరాజు మాట్లాడుతూ నగరికి సమీపంలోని సర్వేనెంబర్ 49/1%లో తరతరాలుగా ఆవులు మేకలు మేపుకుంటూ రైతులు పంటలు పండించుకుంటూ జీవనం సాగిస్తున్న ప్రజలు ఇబ్బంది పడే విధంగా క్వారీలు నడపడం వల్ల చాలా నష్టం వస్తుందని గతంలో అధికారులు దృష్టికి తీసుకు పోవడం జరిగింది కానీ క్వారీ యజమానులు ఏ మాత్రం పట్టిం చుకోకుండా క్వారీలు నడుపుతున్న అధికారులు పట్టించుకోక పోవడం. దురదృష్టకరమన్నారు. అటు మూగజీవాలకు తరతరా లుగా కొండ ప్రాంతంలో గుట్ట ప్రాంతాల్లో వస్తున్నటువంటి వర్షపు నీళ్ళ వలన రైతులు పంటలు పట్టించుకుంటున్నారని క్వారీలు వలన పూర్తిగా ఎండిపోయి నోరులేని మూగజీవాలకు ఇబ్బంది కలిగే ప్రమాదం ఉంది అలాగే చుట్టుపక్కన ఉన్నటువంటి గ్రామాల్లో ఈ క్వారీ పనుల వలన కాలుష్యం ఎక్కువై గ్రామాలు సైతం కాలుష్యంతో ఇబ్బందులు గురై రోగాలు వచ్చే అవకాశం కూడా ఉందన్నారు అలాగే క్వారీల్లో బ్లాస్టింగ్ చేసేటప్పుడు తారు రోడ్లో గ్రామాలకు వెళుతున్న ప్రజలు, విద్యార్థులు జీవాలు వెళ్లడానికి భయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు .ఈ విషయంపై క్వారీలు రద్దు చేయాలని జిల్లా కలెక్టర్ నగరి గ్రీవెన్స్ సందర్భంగా వినతి పత్రం కూడా సమర్పించడం జరిగింది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని సంబంధిత అధికా రులు క్వారీలను పరిశీలించి వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేశారు లేని పక్షంలోనవంబర్ 4 న నగిరి ఆర్డీవో కార్యాలయం ముందు సిపిఐ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపడుతున్నామని హెచ్చ రించారు. ఈ సమావేశంలో నగిరి పట్టణ కార్యదర్శి వి.వ్యాలన్, నగిరి సిపిఐ పట్టణ కార్యవర్గ సభ్యులు ఎస్ షబ్బీర్ భాష , ఎన్ విజయ్ కుమార్, ఎన్ .శేఖర్, ఏఐటీయూసీ పట్టణ నాయకులు చందామరై ,టీ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నాయి బ్రాహ్మణులకు అరుదైన గౌరవం

-కోట చంద్రశేఖర్

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: కూటమి ప్రభుత్వ నిర్ణయంతో నాయీ బ్రాహ్మణులకు అరుదైన గౌరవం దక్కిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్ పేర్కొ న్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నాయీ బ్రాహ్మణులకు అన్ని దేవాలయాల పాలకమండలిలో సభ్యుడుగా అవకాశం కల్పించే విధంగా క్యాబినెట్ మీటింగ్‌లో తీర్మానం చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. నాయీ బ్రాహ్మణులకు మంచి గౌరవం ఇవ్వాలనే ఆశయంతో ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు ఈ నిర్ణయం తీసుకున్నారని కోట చంద్ర శేఖర్ అభిప్రాయ పడ్డారు. నాయీ బ్రాహ్మ ణుల తరఫున ఆయన చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియచేశారు. రాష్ట్రం లో నాయీ బ్రాహ్మణులందరూ టీడీపీ వెంట నడుస్తామ న్నారు. వేరే నామి నేటెడ్ పోస్టుల్లో కూడా తమకు అవకాశాలు కల్పించాలని ఆయన కోరుకున్నారు.

కూనాటి సురేష్‌కు అరుదైన అవకాశం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలం ఊరందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపా ధ్యాయునిగా పనిచేయుచున్న జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కూనా టి సురేష్‌కు అరుదైన అవకాశం లభిం చింది. జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ సంస్థ వారు ఈనెల 28, 29వ తేదీలలో న్యూఢిల్లీలో నిర్వహిస్తున్న రెండు రోజుల కార్యశాలను అమరావతిలోని ప్రభుత్వ పరీక్షల సంచాలకుల ద్వారా ప్రత్యేక ఆహ్వానం అందింది. ఇందు కోసం రాష్ట్రం నుంచి విషయ పరిజ్ఞానం కలిగినటువంటి ఉపా ధ్యాయు నిగా నామినేట్ చేయడం జరిగింది. సాంఘిక శాస్త్రం నుంచి హాజరవు తున్న ఏకైక వ్యక్తిగా అరు దైన అవకాశం సురేష్ కు లభించడం పట్ల పలువురు ఉపాధ్యాయులు అభినం దించారు. మూల్యాంకన విధానంలో విద్యార్థుల స్థాయిని అనుసరించి సమతు ల్యతను పాటించడంపై ప్రసంగించనున్నట్లు కూనాటి సురేష్ ఈ సందర్భంగా తెలియజేశారు.

పశుగణన రైతులకు శ్రేయోదాయకం

విశాలాంధ్ర-చౌడేపల్లి: పశుగణన రైతులకు శ్రేయోదాయకమని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డి(చిట్టి) అన్నారు. శుక్రవారం స్థానిక పశువైద్య కార్యాలయ ఆవరణలో 21వ అఖిలభారత పశు పోషణ గోడ పత్రిక పసుపు పోషణ గోడ పత్రికలను ఆయన ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా ప్రసంగిస్తూ ఫిబ్రవరి 28, 2025 వరకు మండల వ్యాప్తంగా పశుగణన జరుగుతుం దన్నారు. ఇంటి వద్దకు వచ్చే అధికారులకు రైతులు తమ వద్ద ఉన్న ఆవులు గేదెలు కోళ్లు గొర్రెలు కుక్కలు పందులు తదితర జీవాలను గురించి వారికి వివరించాలన్నారు. దీనివల్ల ప్రభుత్వ బడ్జెట్లో నిధులు కేటాయింపు ఉంటుందన్నారు. అంతేకాకుండా పశువులకు అవసరమయ్యే మందులు వ్యాధి నిరోధక మందుల కేటాయింపు సులభతరం అవు తుందన్నారు. రైతులందరూ అధికారులకు సహకరిం చాలని ఆయన కోరారు పశుగణన అయిన తర్వాత సం బంధిత స్టిక్కర్లను రైతుల ఇండ్లకు అతికిం చాలని అధికా రులకు సూచించారు. ఈ కార్యక్ర మంలో పశువైద్యాధి , కారి పవన్ కుమార్ మాజీ ఎంపీటీసీ సభ్యుడు వెంకట రమణ సుధాకర్ రెడ్డి చిన్ని సుదర్శన్ రెడ్డి పశువైద్య సిబ్బ ంది తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పశువుల సమగ్ర వివరాలు అందించండి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: పశువుల సమగ్ర వివరాలు అందించాలని శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని శ్రీకాళహస్తి మండలం ఊరందూరులో శుక్రవారం ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పశు వైద్య సిబ్బంది రైతుల ఇళ్ల వద్దకు వచ్చిన సమయంలో తమ వద్ద ఉన్న పశువులు, కోళ్లు,గొర్రెలు, మేకలు, వ్యవసాయ సామాగ్రి వంటి వివరాలను ఎలాంటి అపోహలు చెందకుండా సమగ్రంగా తెలపాలన్నారు. ఈ పశుగణన వల్ల పశుసంవర్ధక శాఖ వారి భవిష్యత్తు ప్రణాళికకు ఉపయోగపడుతుందన్నారు. భూమిలేని నిరుపేదలు అనేకమంది పశు పోషణపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ఇక సహాయ సంచాలకులు డాక్టర్ ఎన్ వీ శ్రీకాంత్ బాబు మాట్లాడుతూ... ప్రతి ఐదేళ్లకు ఒకసారి పశుగణన నిర్వహిస్తారన్నారు. 16 రకాల పెంపుడు జంతువులపై జాతుల వారీగా సమాచారాన్ని ప్రత్యేక యాప్ ద్వారా ఆన్ లైన్ లో సేకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఊహ,రవీంద్ర వర్మ, అరుణ్ కుమార్, ఉషా,శరత్ పలువురు పశు సంవర్ధక శాఖ సహాయకులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తులు పంపిణీ

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు పట్టణంలోని ఓం శ్రీ వృద్ధ ఆశ్రమంలో వృద్ధులకు దుస్తులు, దుప్పట్లను లయన్స్ క్లబ్ ఆఫ్ గూడూరు వై.జి.పి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ రీజియన్ చైర్మన్ ఆర్.వి.రావు, మాజీ అధ్యక్షులు రవీంద్ర రెడ్డిలు మాట్లాడుతూ క్లబ్ ద్వారా పట్టణ, పరిసర ప్రాంతాల్లో పలు సేవా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవరచు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు గురు నాథం, మురళి నాయుడు, ప్రసాద్, ఎస్.ఎల్.ఎన్ స్వామి, గోపీనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ కమిటీలలో బ్రాహ్మణులకు చోటు కల్పించడం అభినందనీయం

- సీనియర్ ఆడిటర్ శ్రీ కంతి రామ్మోహన్ రావు

విశాలాంధ్ర-గూడూరు: ఆంధ్రప్రదేశ్ మంత్రి వర్గ సమావేశంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన కూటమి ప్రభుత్వం కొన్ని ముఖ్యమైన విషయములపై చర్చించి నిర్ణయం తీసుకోవడ మైనది. అందులో ముఖ్యంగా స్థానిక దేవాలయ కమిటీలలో సభ్యులుగా బ్రాహ్మణు లకు చోటు కల్పిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతను మంత్రి వర్గ సభ్యులు నిర్ణయం తీసుకోవడమైనది. ఈ విషయము చాల సంతోషదాయకమైనది. ఈ చర్య వలన హిందూ సమాజ అభివృద్ధికి, దేశ అభివృద్ధికి తోడ్పడుతుందని వారికీ తిరుపతి జిల్లా, గూడూరు ఆదిశంకర బ్రాహ్మణ సేవా సంఘం తరపున కృతజ్ఞతలు తెలియచేయడమైనది. ఈ కార్యక్రమములో సంస్థ గౌరవ అధ్యక్షుడు శ్రీకంతి రామ మోహన్ రావు, ప్రెసిడెంట్ ప్రసాద్, కార్యదర్శి నరేష్ అసోసియేట్ ప్రెసిడెంట్ శ్రావణ్ కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాహుకాల అభిషేకానికి విశేష స్పందన

విశాలాంధ్ర-చౌడేపల్లి: శక్తి క్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో నిర్వహించిన రాహుకాల అభిషేకానికి విశేష స్పందన లభించింది తెల్లవారు జామునే ఆలయ అర్చకులు విశేష అభిషేకము అలంకరణ గావించారు అనంతరం రాహుకాల సమయంలో దంపతుల సమక్షంలో అమ్మవారికి రాహుకాల అభిషేకం నిర్వహించారు. అనంతరం పాత కళ్యాణకట్ట భవనంలో అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అన్నదానానికి పలమనేరు నవీన్ కుమార్ అతని మిత్ర బృందం కూరగాయలను విరాళంగా అందించారు. ఆలయ ఈవో ఉప కమిషనర్ ఏకాంబరం అధికార అర్చక సిబ్బంది భక్తులకు సేవలు అందించారు.

పిల్లమేడులో రీ సర్వే గ్రామ సభ

విశాలాంధ్ర-తొట్టంబేడు: తొట్టంబేడు మండలం పిల్లమేడు లో శుక్రవారం రీ సర్వే గ్రామ సభ నిర్వహించారు. ఇందులో భాగంగా పిల్లమేడు రెవిన్యూ పరిధిలో గల భూ సమస్యలకు సంబందించి స్థానికుల నుంచి అధికారులు వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా తొట్టంబేడు తహసీల్దారు మధుసూదనరావు మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో భూ సమస్యలు పరిష్కరించాలనే ఆశయంతో రాష్ట్ర ప్రభుత్వం రీ సర్వే గ్రామ సభలు నిర్వహిస్తోందన్నారు. ప్రజలు ఈ అవకాశం వినియోగించుకుని సమస్యలు పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. ఈ సభలో డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే రాఘవయ్య, మండల సర్వేయర్ హరినాథ్, పెద్దకనపర్తి గ్రామ రెవెన్యూ అధికారి కృష్ణమూర్తి, సచివాలయ సర్వేయర్లు రాఘవ, ఆరిఫ్, సుకన్య, అంజలి, కమ్యూనిటీ సర్వేయరు సత్యనారాయణ, పిల్లమేడు రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి రాకకు ఏర్పాట్లు చేయండి: ఎమ్మెల్యే నాని

విశాలాంధ్ర-చంద్రగిరి: ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు రాకకు చక్కటి ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే పులివర్తి నాని అధికారులతో సమీక్ష నిర్వహించారు. గత కొద్దిరోజులుగా కురిసిన భారీ వర్షాలు కారణంగా ఇంటి ఆవరణమంతా కలియ తిరుగుతూ అధికారులతో కలిసి పులివర్తి నాని పరిశీలించారు. స్వగ్రామం నారావారిపల్లెకి చంద్రబాబు నాయుడు సంక్రాంతి పండుగకు రానున్న నేపథ్యంలో ఆయన స్వగృహం ఆవరణలో మౌలిక వసతుల ఏర్పాట్లపై ఎమ్మెల్యే నాని అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఇంటి పరిసరాల్లో చేస్తున్న ఏర్పాట్లు గురించి ఆరా తీశారు. చంద్రబాబు నాయుడు ఇంటికి రంగులు వేయించడం, చిన్నపాటి మరమ్మతులు చేయించటం, వంటి వాటితో పాటుగా వచ్చిన ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించేందుకు, అలాగే పోలీసు బలగాలు ఉండడానికి వసతి సదుపాయాల ఏర్పాటుపై అధికారులతో చర్చించారు. అదేవిధంగా ఎ.రంగంపేట నుండి కొంగరవారి పల్లి వరకు రోడ్డుకు ఒకవైపు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. నారావారిపల్లెకు సమీప గ్రామాలైన మామిడిమాను గడ్డ, భీమవరం, మూలపల్లి ప్రాంతాలలో భీమా నదిపై 2021లో వచ్చిన వరదలకు కొట్టుకుపోయిన వంతెనలను వీలైనంత త్వరగా పునర్నిర్మించాలని సంబంధిత అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, అనధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

గంగా ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు సరి కాదు

విశాలాంధ్ర-గూడూరు: పారిశ్రామికవేత్త, సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకుడు గంగా ప్రసాద్ పై సూళ్లూరుపేట నియోజకవర్గం పెళ్లకూరు మండలానికి చెందిన మాజీ జెడ్పిటిసి వైసిపి సీనియర్ నాయకుడు సత్యనారాయణ రెడ్డి చేసిన అసభ్యకర వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ హెచ్చరించారు. గూడూరు పట్టణంలోని గూడూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సునీల్ కుమార్ టిడిపి నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ సత్యనారాయణ రెడ్డి యొక్క జీవితం ఎలాంటిదో మాకు బాగా తెలుసు అని అన్నారు. ఏనాడు ఏ నాయకుడు గురించి బహిరంగంగా ప్రస్తావించని గంగా ప్రసాద్ పై సత్యనారాయణరెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని హెచ్చరించారు. హుందా తనంగా నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర-కార్వేటినగరం: మాదక ద్రవ్యాలపై ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని విద్యార్థు లకు శుక్రవారం క్రాస్ సచ్చంద సేవా సంస్థ ఆధ్వ ర్యంలో నెహ్రూ యువ కేంద్రం చిత్తూరు వారి సహకారంతో ఆహ్వాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ యువ కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ ప్రదీప్, క్రాస్ సంస్థ డైరెక్టర్ భూపతికి మాట్లాడుతూ విద్యార్థులకు మాదకద్రవ్యాలు తీసుకోవడం వలన కలిగే అనర్థాల గురించి వివరించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయులు రెడ్డి మాట్లా డుతూ అవార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో కలానాటకం నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించడంపట్ల సంతోషం వ్యక్తం చేశా రు. కార్యక్రమంలో ఎస్ఐ రాజకుమార్, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఇంచార్జ్ ధనంజయ రెడ్డి, క్రాస్ సంస్థ సభ్యులు సోమశేఖర్, హరీష్, దొరస్వామి, మునికృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా టపాసులు అమ్మితే కఠిన చర్యలు

విశాలాంధ్ర-వరదయ్యపాలెం: ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ తిరుపతి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పుత్తూరు డిఎస్పీ పర్యవేక్షణలో సత్యవేడు సిఐ మురళి ఆధ్వర్యంలో నిఘా పెట్టడం జరిగిందనీ, గతంలో మండలంలో ఎల్ల కట్టవలో అను మతులు లేకుండా టపాసులు బాణా సంచా అక్రమ తయారీ గోడౌన్లో పేలుడు సంభవించి ముగ్గురు చనిపోయిన ఘటనను దృష్టిలో పెట్టుకొని మండలంలో దీపావళికి నిఘా పెట్టడం జరిగిందని, మండలంలో ప్రజల ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడడమే పోలీసు శాఖ కర్తవ్యం కాబట్టి ఎట్టి పరిస్థితుల్లోనూ మండలంలోని గ్రామాలలో, మండల కేంద్రంలో అక్రమ అమ్మకాలు జరగకుండా చూస్తామని, ఎవరైనా అక్రమంగా అనుమతులు లేకుండా అమ్మకాలు జరిగితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏది ఏమైనా అదేవిధంగా వరదయ్య పాలెం మండల ప్రజలకు ముందస్తు దీపావళి శుభాకాంక్షలు తెలుపుతున్నామని, మండలంలోని ప్రజలు కూడా బాణాసంచా, టపాసులు పేల్చే సమయంలో కచ్చితంగా జాగ్రత్తలు వహించాలని ఎలాంటి ప్రమాదాలకు గురికాకుండా ముఖ్యంగా పిల్లలను దూరంగా ఉంచాలని మహిళలు వృద్ధులు జాగ్రత్తగా ఉండాలని, మరి ముఖ్యంగా సామాజిక బాధ్యతతో పర్యావరణానికి హాని కలగకుండా ప్రతి ఒక్కరూ కాలుష్యం కాకుండా తమ వంతు బాధ్యతతో నడుచుకోవాలని ఎస్ఐ మల్లికార్జున మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

మనోధైర్యంతో క్యాన్సర్ మహమ్మారిని నిర్మూలించవచ్చు

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: రాష్ట్రీయ సేవా సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్. ఎస్.వెంకటరత్నం సూచనల మేరకు తిరుపతి కార్పొరేషన్ పరిధిలోని యానాది కాలనీలోని ప్రభుత్వ హాస్పిటల్ లో మారుతీ నగర్ రాస్ క్లస్టర్ పరిధిలో మహిళలకు శు క్రవారం ఉచిత క్యాన్సర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన పంచాయతీ సెక్రెటరీ లావణ్య మాట్లాడుతూ మహిళల కోసం రాస్ చేస్తున్న వివిధ సేవా కార్యక్రమాలు అభినంద నీయమని తెలిపారు. క్యాన్సర్ బారిన పడ్డారన్న సంగతి తెలియగానే చాలామంది గుండె నిబ్బరాన్ని కోల్పోతారు. క్యాన్సర్ కంటే వారిని భయమే మానసికంగా కుంగదీసి చంపేస్తుంది. క్యాన్సర్ వ్యాధి సోకినవారికి జీవితం మీద ఆశలు కల్పించే విధంగా వారిలో మనోధైర్యాన్ని నింపే విధంగా రాస్ కృషి చేస్తుంది తెలిపారు. 50 శాతం మందుల వల్ల నయం అవుతాయి. మరో 50 శాతం సంకల్పబలం వల్లే సాధ్యమవుతుందని తెలిపారు. అనంతరం టాటా ట్రస్ట్ క్యాంపు కో - ఆర్డినేటర్ హేమంత్ కుమార్ మాట్లాడుతూ క్యాన్సర్ మహమ్మారి ప్రపంచవ్యాప్తంగా కొన్ని వేల మందిని పొట్టన పెట్టుకుంటున్నదని, ధూమపానం, మద్యపానం, పురుగుల మందులు అవశేషాలు ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవడం వంటివి క్యాన్సర్‌కు ప్రధాన కారణాలుగా వైద్యులు చెబుతున్నారు. కొన్ని సందర్భాలలో చిన్నారులు మహిళలు క్యాన్సర్ బారిన పడుతున్నారు. క్యాన్సర్ ప్రాణాలను హరించే ప్రాణాంతకర వ్యాధే కానీ ప్రాథమిక దశలో గుర్తిస్తే ఈ మహమ్మారిని జయించవచ్చు అని తెలిపారు. అనంతరం 150 మందికి బీపీ, షుగర్, హెపటైటిస్ మరియు క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టాటా ట్రస్ట్ ఆసుపత్రి సిబ్బందితోపాటు నాగేశ్వర్, బాలాజీ, జ్యోతి క్లస్టర్ లీడర్లు సుబవల్లిత, వెంకటలక్ష్మి, దేవకి, లక్ష్మీ దుర్గ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేలోని పొరపాట్లను సర్దుబాటు చేసుకోండి

విశాలాంధ్ర-చంద్రగిరి: రైతులు తమ భూములను రీసర్వేలో జరిగిన పొరపాట్లును ఇతర భూ సమస్యలను తమ దృష్టికి తీసు కొచ్చి పరిష్కరించుకోవాలని గ్రామసభ ద్వారా తాసిల్దార్ శివరామ సుబ్బయ్య తెలి పారు. సి.సి.ఎల్.ఎ. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ము, అమరావతి వారు రీసర్వే జరిగిన రెడ్డివారిపల్లి రెవిన్యూ గ్రామం తహశీల్దారు అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించి మ్యుటేషన్స్, జాయింట్ ఎల్.పి.యంలు, భూమి తగాదాలు. సెక్షన్ 22(ఎ) అభ్యంతరములు మొదలుగునవి ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించి రిజిస్టరునందు నమోదు చేసి ఆన్లైన్ నందు పొందుపరచవలసినదిగా ఆదేశించారు. చంద్రగిరి మండలము రెడ్డివారిపల్లి రెవిన్యూ గ్రామముల నందు శుక్రవారం ఉదయం 10.00 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు రెడ్డివారిపల్లి సమావేశ మందిరం నందు గ్రామసభ నిర్వహించబడింది. సదరు గ్రామసభకు చంద్రగిరి మండల తహసీల్దారు, మండల సర్వేయర్ సురేష్ బాబు, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్, విఆర్ఓ విజయ కుమార్, గ్రామ సర్వేయర్ మమత మరియు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. సదరు గ్రామసభలో ముటేషన్‌కు 1, పట్టా సబ్ డివిజన్‌కు 1, విస్తీర్ణం కరెక్షన్‌కు 4 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు.

గ్రామసభలో భూమి సమస్యల పరిష్కారనికి కృషి

విశాలాంధ్ర-కార్వేటినగరం: మండల పరిధిలోని అన్నూరు గ్రామసభలో శు క్రవారం భూ సమస్యలపై 13 అర్జీలు రైతులనుండి వచ్చిందని తహసీల్దార్ భగవతి, డిప్యూటీ తహసీల్దార్ స్వరూపారాణి తెలిపారు. ఇందులో భూమి తాగదాలు, పాస్ పుస్తకంలో పేర్లు మార్పు తదితర అంశాలపై వినతులు వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ పి.బాబు, సచివాలయం సర్వేయర్‌లు, విఆర్ఓలు, తేజ, గాయత్రి, టిడిపి నాయకులు, రాంబాబు రెడ్డి, మనోహ, శోభన్ బాబు, రైతులు పాల్గొన్నారు.

నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేసిన నెలవల విజయశ్రీ

విశాలాంధ్ర-నాయుడుపేట: నాయుడుపేట సామాజిక ప్రభుత్వ వైద్యశాలను శుక్రవారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ఆకస్మికంగా తనిఖీ చేశారు.వైద్యశాలలో నెలకొని ఉన్న సమస్యలను ఆమె స్వయంగా తెలుసుకున్నారు. ముందుగా వైద్యశాల సూపరిండెంటెంట్ మీజూరు చంద్రకళతో కలిసి అక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. నాయుడుపేట కేంద్రంగా ఉన్న వైద్యశాలలో కేవలం ఇద్దరు ఇన్ పేషంట్స్ ఉండటాన్ని గుర్తించారు. నాయుడుపేట వైద్యశాల నందు అవుట్ పేషెంట్ ఓపి రోజుకి 250 మందికి సేవలు అందిస్తున్నట్లు వైద్యులు శాసనసభ్యురాలుకు తెలిపారు. వైద్యసేవలు అందించే బెడ్లపై కనీసం దుప్పట్లు కూడా లేకుండా బెడ్స్ అపరిశుభ్రంగా ఉండడంతో వైద్యులపై మండిపడ్డారు. అత్యవసర పనులు ఉండడం వల్ల ఈరోజు పరిశీలించలేదని డాక్టర్ చంద్రకళ సమాధానం ఇచ్చారు. ప్రభుత్వ వైద్యశాలలో ఎంతమంది వైద్యులు ఉన్నారు, ఎంతమంది స్టాఫ్ నర్స్ లు ఉన్నారు. ఈరోజు ఎంతమంది హాజరై ఉన్నారు, తదితర వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే వైద్యశాలలో ఉన్న వైద్య సిబ్బందితో వ్యక్తిగతంగా సమావేశమై ఆసుపత్రిలో ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. వైద్యశాలలో పారిశుద్ధ్య సిబ్బందికి నాలుగు నెలలుగా జీతాలు అందడం లేదని వారు ఎమ్మెల్యే ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. నెలలు తరబడి జీతాలు ఇవ్వకపోతే, తాము భార్యాబిడ్డలతో పస్తులు ఉండవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పరిస్థితి కార్మికుల సమస్యలు త్వరలో పరిష్కరిస్తారని ఆమె హామీ ఇచ్చారు. ఆమె వెంట మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం, ఏఎంసీ మాజీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, నాయకులు నెలవల రాజేష్, ఉగ్గుమూడి భాస్కర్‌రెడ్డి, గంగాప్రసాద్, సుబ్బారావు, సత్యం, పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్కర్ష్ ఎస్ఎఫ్‌బిఎల్ అవుట్‌లెట్ ప్రారంభం

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఉత్కర్ష్ ఎస్ఎఫ్‌బిఎల్) ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో తమ కొత్త బ్యాంకింగ్ అవుట్‌లెట్ ను శుక్రవారం ప్రారంభించింది. ఈ సందర్భంగా ఆ సంస్థ ఎండి, సీఈవో గోవింద్ సింగ్ మాట్లాడుతూ తిరుపతిలో మా నూతన బ్రాంచ్ ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలో మా కార్యకలాపాలను విస్తరించే దిశగా ఇది ఒక ముఖ్యమైన ముందడుగు. ఈ బ్యాంకింగ్ అవుట్‌లెట్ ప్రారంభోత్సవం, స్థానిక కమ్యూనిటీలకు బ్యాంకింగ్ సేవలను పొందడం మాత్రమే కాకుండా, స్థానిక కమ్యూనిటీలలో ఆర్థిక అభివృద్ధి, ఆర్థిక చేరిక సాధికారతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది" అని అన్నారు. పొదుపు, కరెంట్ ఖాతాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రికరింగ్ డిపాజిట్ లు సహా విభిన్నమైన ఆర్థిక ఉత్పత్తులు, సేవల శ్రేణిని తమ కస్టమర్లకు అందించే స్థితిలో బ్యాంక్ ఉందన్నారు. తన కస్టమర్ల ఆకాంక్షలను తీర్చడానికి, గృహ రుణాలు, వ్యాపార రుణాలు, ఆస్తిపై రుణం వంటి వివిధ రుణ ఉత్పత్తులను సైతం బ్యాంక్ అందిస్తుందని తెలిపారు. టాబ్లెట్ ఆధారిత అప్లికేషన్ అసిస్టెడ్ మోడల్, "డిజి ఆన్-బోర్డింగ్" ద్వారా బ్రాంచ్‌ను సందర్శించాల్సిన అవసరం లేకుండానే బ్యాంక్ ఖాతా తెరవడానికి కస్టమర్లకు బ్యాంక్ సదుపాయాన్ని అందిస్తుందని, దీనిని వినియోగదారుల సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

పిఎఫ్ మరియు సిపిఎస్ ఉద్యోగులకు బకాయిలు వెంటనే చెల్లించాలి

విశాలాంధ్ర-తిరుపతి: ప్రభుత్వ ఉద్యోగులకు పి ఎఫ్ మరియు కాంట్రిబ్యూషన్ పెన్షన్ బకాయిలు వెంటనే చెల్లించాలి రాష్ట్రోపాధ్యాయ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేష్ బాబు మరియు జగన్నాథం లు డిమాండ్ చేశారు. ఈ రోజు స్థానిక తిరుపతి జిల్లా కలెక్టరు కార్యాలయం నందు గల సమావేశ మందిరంలో నిర్వ హించిన పెన్షన్ అదాలత్ కార్యక్రమం లో సంబంధిత అధికారులు కు సమస్యలపై ప్రాతినిధ్యం చేశారు. తిరుపతి జిల్లాలో వివిధ మండలాల ఎంఈఓ లు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు 2018 జూలై మరియు 2019 జనవరి డీఏలకు సంబంధించిన ఉత్తర్వులు విడుదల చేసి రెండు డి ఏ లను ఆరు విడతలగా 2021 వ సంవత్సరంలో బిల్లులు చేసుకోవాల్సినదిగా షెడ్యూల్ ఇచ్చింది. ఈ ఆరు ఓపీఎస్ వారికి పిఎఫ్ ఖాతాలకు సిపిఎస్ వారికి పది పర్సెంట్ మినహాయించి క్యాష్ రూపంలో ఇచ్చేలా ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు తిరుపతి జిల్లాలో పీఎఫ్ ఖాతాలకు జమ కాలేదు. అలాగే 100 శాతం సిపిఎస్ వారికి నగదు రూపంలో చెల్లించ తెలియజేస్తున్నాము. అదేవిధంగా జడ్పీపీఎఫ్ కు సంబంధించి 2021 మార్చి నెలజీతాల నుండి ఉపాధ్యాయుల ఖాతాలకు జమ కాలేదు. 2022 సెప్టెంబర్ నుండి సిపిఎస్ ఉద్యోగుల వ్యక్తిగత కాంట్రిబ్యూషన్ మరియుప్రభుత్వం జమ చేయాల్సిన మ్యాచింగ్ గ్రాంట్ ఉద్యోగ మరియు ఉపాధ్యాయుల ప్రాన్ అకౌంట్స్ కు జమ కాకపోవడం వలన వారు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని విన్నవిస్తున్నాము. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి కఠారి మోహన్, జిల్లా సహాధ్యక్షులు ముని కృష్ణమ నాయుడు, డివిజన్ కన్వీనర్ వాసు, అర్బన్ అధ్యక్షులు మురళి, శ్రీనివాసులు, వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు ఆటో దొంగలు అరెస్టు.. 6 ఆటోలు స్వాధీనం

విశాలాంధ్ర-వి.కోట: మండల కేంద్రంతో పాటు సమీప గ్రామాల్లో ఇటీవల ఆటోల దొంగతనానికి గురౌతున్నాయి. ఈ విషయమై ఆటో ఓనర్ల ఫిర్యాదు పై స్థానిక అర్బన్ సిఐ ఆర్, సోమశేఖర్ రెడ్డి ఎస్సై ఇ. బాబులు ప్రత్యేక నిఘా ఉంచి పలమనేరు డిఎస్పి ఆదేశాల మేరకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి దొంగలను పట్టుకున్నారు. వారి నుండి రూ. 10 లక్షల విలువ చేసే రెండు లగేజీ ఆటోలు, నాలుగు ప్యాసింజర్ ఆటోలు స్వాధీనం చేసుకొని ముగ్గురు దొంగలను రిమాండ్ కు పంపారు. విషయమై శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్ లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిన సిఐ సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ వి. కోట మండల కేంద్రంలోని బాపూజీ వీధికి చెందిన ముస్తఫీర్ (19) జబీ (31) హనుమేపల్లికి చెందిన సల్మాన్ (22)లు ఈజీ మనీ కోసం ఆటోలను దొంగిలించి తమిళనాడు రాష్ట్రం తిరుపత్తూర్ లోని ఒక ఆటో మెకానిక్ కు అమ్మేవారిని తెలిపారు. గురువారం పై ముగ్గురు కనమనాయనిపల్లి సమీపంలో సంచరిస్తున్నట్లు గుర్తించి అరెస్టు చేసినట్లు తెలిపారు.

పశు గణన సమర్థవంతంగా చేపట్టాలి

- గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్

విశాలాంధ్ర-గూడూరు: 21వ అఖిలభారత పశు గణన ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం పారదర్శకంగా నిర్వహించాలని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ అన్నారు. గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పశుసంవర్ధక శాఖ అధికారులు 21వ అఖిలభారత పశుగణన కార్యక్రమంలో వినియోగించే కిట్లను ఎమ్మెల్యే సునీల్ కుమార్ పశుసంవర్ధక శాఖ అధికారులు సిబ్బందికి అందజేసి పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ 21వ అఖిలభారత పశుగణన కార్యక్రమం నేటి నుండి 2025 ఫిబ్రవరి నెల వరకు జరుగుతుందని ఈ కార్యక్రమంలో వచ్చిన గణాంకాల ఆధారంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పశువుల సంరక్షణకు, వాటి పోషణకు అవసరమైన ప్రణాళికలను రూపొందించి అమలు చేయడానికి వీలవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్య శాఖ సహాయ సంచాలకులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే సేవాభావం కలిగి ఉండటం గొప్ప విషయం

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: విద్యార్థి దశ నుంచే సేవా భావం కలిగి ఉండటం గొప్ప విషయమని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. తిరుపతి రూరల్ మండలం తిరుచానూరులోని ఎడిపై పాఠశాల విద్యార్థులు ముఖ్యమంత్రి సహాయ నిధికి 5లక్షల రూపాయల చెక్ ను ఎమ్మెల్యే పులివర్తి నానికి శుక్రవారం అందించారు. ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళం ఇచ్చిన ఎడిపై సంస్థ విద్యార్థులకు ప్రత్యేక ధన్యవాదాలుతో పాటుగా ఎమ్మెల్యే పులివర్తి నాని అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎడిపై విద్యార్థుల విశాల భావం పదిమందికి ఆదర్శం కావాలని అన్నారు. కష్టాలలో ఉన్న సాటివారిని ఆదికుందామన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపుతో పలువురు స్పందించారని ఆ కోవలోనే ఎడిపై విద్యార్థులు కూడా విరాళాలతో ముందుకు రావటం ప్రశంసనీయమన్నారు. విద్యార్థులందరూ ఉజ్వల భవిష్యత్తుతో మరింత మందికి ఆదర్శం కావాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎడిపై విద్యాసంస్థల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆట పాటలతో అంగన్వాడి కేంద్రం

విశాలాంధ్ర-కార్వేటి నగరం: కార్వేటి నగరంలోని విజయ మాంబాపురం అంగన్వాడి కేంద్రంలో ఆటపాటలతో చిన్నారులకు చదువు చెప్పడంపై గ్రామస్తులు కార్యకర్త జీవనం అభినందించారు. గ్రామంలో ప్రభుత్వ భవనం లేకపోవడంతో అద్దె భవనంలో నడుస్తుంద నీ గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో నాడు నేడు కింద ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణం నూతనంగా నిర్మిస్తున్నారని పాఠశాల ప్రారంభమైన వెంటనే అందులో ఒక రూము ఇస్తామని ఎంఈఓ చెప్పారని సిడిపిఓ పద్మ సునందతెలియజేశారు. అంగన్వాడీ కేంద్రంలో అద్దె భవనంలో నడుస్తుందని ఆమె పేర్కొన్నారు.

నీటి ఇబ్బందిని పరిష్కరించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-తిరుపతి: ఆరవ డివిజన్ లోని కట్టకిందపల్లి వద్ద వర్షాలకు రెండు అడుగుల మేర నీళ్ళు నిలిచిపోవడంతో స్థానికుల రాకపోకలకు ఇబ్బందిపడ్డారు. సమస్యను స్థానికులు ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు దృష్టికి తీసుకువచ్చారు. దీనితో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ ఈని తక్షణం సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. దీనితో అధికారులు వెంటనే జెసిబి పెట్టించి నిలిచిన నీటిని తొలగించారు. ఈ పనులను జనసేన నగర అధ్యక్షులు రాజారెడ్డి తదితరులు దగ్గర ఉండి పర్యవేక్షించారు. నీళ్ళు నిలవడంతో ఒకటవ డివిజన్ , ఆరవ డివిజన్ ప్రజలు ఇబ్బందులకు గురైయ్యారని రాజా రెడ్డి తెలిపారు. అయితే సమస్యను తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే పరిష్కరించినట్లు ఆయన చెప్పారు. ఒకటి, ఆరు డివిజన్ల ప్రజలు సమస్య పరిష్కారంలో హర్షం వ్యక్తం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు బాబ్జీ, హేమంత్, వంశీ, బాలాజీ, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయు గర్ల్స్ హాస్టల్స్‌లో సమస్యలను పరిష్కరించాలి

జిల్లా కార్యదర్శి ప్రవీణ్. కార్యదర్శి చంద్రనాయక్

విశాలాంధ్ర-తిరుపతి: అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం గర్ల్స్ హాస్టల్స్ లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు ఇన్చార్జి విసి అప్పారావుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమానంతరం ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి, యూనివర్సిటీ కార్యదర్శి, లేడీ కన్వీనర్స్, ప్రవీణ్, చంద్రనాయక్, వెన్నెల, శృతి, శివరాం కుమారి, వనిత, పద్మ ప్రియా,శరవరాలు, శ్రావణి, మల్లికా, వాణిశ్రీ మాట్లాడుతూ గర్ల్స్ హాస్టల్స్ లో విద్యార్థినీలు వివిధ ఇబ్బందులకు గురవుతున్నారని హాస్టల్స్‌లో నాణ్యమైన భోజనం పెట్టడం లేదంటూ ఆరోపించారు. సకాలంలో వాడుకోవడానికి కనీస వసతులైన నీరు కూడా సకాలంలో అందడం లేదని వారు ఆరోపించారు. విశ్వవిద్యాలయంలో గర్ల్స్ హాస్టల్‌కు సంబంధించి వార్డెన్లు ఎవరో కూడా విద్యార్థులు తెలియని దుస్థితిలో ఉన్నారని వారు ఆరోపించారు. గర్ల్స్ హాస్టల్‌లో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారమయ్యే విధంగా వార్డెన్లు స్పందించాలని వారు కోరారు. సమస్యలు పరిష్కారం కాకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున విద్యార్థి ఉద్యమాలకు శ్రీకారం చుడతామని ఇంచార్జ్ అప్పారావుని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ యూనివర్సిటీ ఉపాధ్యక్షులు నర్సింహులు, విద్యార్థులు పాల్గొన్నారు

నేడే తెలుగు దేశం పార్టీ సభ్యత్వ నమోదు

విశాలాంధ్ర-గుడిపాల: గుడిపాల మండలం లో ఈ శనివారం మధ్యాహ్నం 3 గంటలకు మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం, కనుక మండలంలోని తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నాయకులందరు తమ బాధ్యతగా భావించి నియోజకవర్గంలో విజయవంతం చేయాలని శాసన సభ్యులు గురజాల జగన్ మోహన్ కోరారు. ముఖ్యంగా కొత్త సభ్యత్వలతో పాటు రెన్యూవల్స్‌ను కూడా చేపట్టి పార్టీ బలోపేతంలో భాగస్వామ్యులు కావాలన్నారు. ఎప్పటి లాగానే 100 రూపాయలతో 5 లక్షల ఇన్సురెన్స్ పొందగలరని ఈ సధావకాసాన్ని సద్వినియోగం పరుచుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

చెంగాలమ్మను దర్శించుకున్న స్పెషల్ జడ్జ్

విశాలాంధ్ర-సూళ్లూరు పేట: సులూరుపేటలో వెలసి ఉన్న ఆంధ్ర తమిళ భక్తుల ఆరాధ్య దైవం దక్షిణంకాలి కోరిన కోరికలు తీర్చే భక్తుల పాలిట కల్పవల్లి శ్రీ చెంగాల మాత పరమేశ్వరి దేవి ని శుక్రవారం నెల్లూరు జిల్లా ఎస్సీస్ ఎస్టిస్ పిఓఏడికం అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి యస్.సరస్వతి దర్శించుకొన్నారు. వారిని సహాయ కమిషనరు, కార్యనిర్వాహణాధికారి బి.ప్రసన్నలక్ష్మీ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అనంతరం వేద పండితులచే అమ్మవారికి పూజలు నిర్వహించారు. తదుపరి వేదపండితులచే ఆశీర్వచనము చేసి తీర్ధ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమములో ఎస్వి బ్రాహ్మ నాయుడు తదితరులు ఉన్నారు.

మద్యం దుకాణం తొలగించాలని వినతి

విశాలాంధ్ర: చిట్టమూరు: మండలంలోని కొత్తగుంట కూడలలో దుర్గరాజుపట్నం, నాయుడుపేట రోడ్డు పక్కనే ఉన్న మద్యం దుకాణాల వల్ల పక్కనే ఉన్న కళాశాలకు వెళ్లే విద్యార్థులకు అక్కడే ఆటో స్టాండ్ వద్దకు వచ్చి గ్రామానికి వెళ్లే మహిళలకు ఈ మద్యం దుకాణం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే వేరొక చోటుకు మార్చాలని వాకాడు ప్రొబిషన్ సిఐకి చిట్టమూరు మండల తాసిల్దార్ ఐవన్ ప్రసాద్‌కి చిట్టమూరు సర్పంచ్ కోటయ్య వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కోటయ్య మాట్లాడుతూ గతంలో అక్కడ పాఠశాల లేని సమయంలో మద్యం దుకాణం నిర్వహించేవారని గత ప్రభుత్వం మద్యం వివరాలు ఏర్పాటు చేసి ఈ ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. స్థానికులు పలు పర్యాయాలు ఇక్కడ షాప్ తొలగించాలని అధికారులకు తెలిపిన స్థానిక నాయకుల సహకారంతో అధికారుల వత్తిల్లతో ఇక్కడ మద్యం షాపు యధావిధిగా కొనసాగించారన్నారు. ఈ షాపు దారిని పాఠశాలకు వెళ్లే విద్యార్థులు కోట, వాకాడు తీర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఇక్కడ ఆటో స్టాండ్ వద్దకు వచ్చి గంటల తరబడి ఆటోలు కోసం వేచి ఉంటారని మందుబాబులు ఈ ఆటో స్టాండ్ పక్కనే ఉన్న బ్రాందీ షాపులో మద్యం సేవించి వారి నోటికి వచ్చినట్లు మాట్లాడుతూ ఆడవాళ్లు ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. మద్యం దుకాణం పై దృష్టి సారించి ఇక్కడ నుంచి తొలగించి వేరొక చోట ఏర్పాటు చేసుకోవాలని చిట్టమూరు సర్పంచ్ తెలిపారు. ఆయన వెంట మురళి, కోటయ్య, సురేష్ పలువురు గ్రామస్తులు ఉన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర-చిల్లకూరు: మండలకేంద్రం చిల్లకూరు లోని విద్యుత్ సబ్-స్టేషన్‌లో మరమతులు, విద్యుత్ లైన్లకు అడ్డంగా ఉన్న చెట్లను తొలగించే కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుంది అని విద్యుత్ శాఖ ఏఈ రమేష్ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. విద్యుత్ వినియోగ దారుల ఈ విషయం గమనించి తమ అత్యవసారలకోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

నగర పరిసరాల అభివృద్ధికి సహకారం అందించండి

తిరుపతి నగర కమిషనర్ మౌర్యను కోరిన చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: తిరుపతి నగర పరిసర ప్రాంతాలలో అభివృద్ధికి సహకారం అందించాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని కోరారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మౌర్య ను ఎమ్మెల్యే పులివర్తి నాని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పలు అంశాలపై కమిషనర్ తో మాట్లాడారు. తిరుపతి నగర శివారు ప్రాంతాలలో పారిశుద్ధ్యాన్ని మెరుగు పరచాలని కోరారు. ముఖ్యంగా మురికి వాడలలో మౌలిక వసతుల కల్పనకు ఉదారంగా నిధులు కేటాయించాలని తెలిపారు. సిమెంట్ రోడ్లు,తాగునీటి సౌకర్యాలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ ఏర్పాటు చేయాలన్నారు. తిరుపతి ప్రధాన నగరం నుంచి మురుగునీరు శివారు ప్రాంతాలలోకి ప్రవహిస్తున్నదని అలాంటి వాటిని పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలన్నారు. అన్ని సమస్యలను విన్న మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మౌర్య పరిశీలించి ప్రజా సంక్షేమం దిశగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే నానికి హామీ ఇచ్చారు.

27న జీ తెలుగులో డబుల్ ఇస్మార్ట్

విశాలాంధ్ర-తిరుపతి: జీ తెలుగు ఈ వారం మరో కొత్త సినిమాతో వచ్చేస్తోంది.ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని, కావ్య థాపర్ జంటగా నటించిన మాస్‌ఎంటర్టైనర్ 'డబుల్ ఇస్మార్ట్' సినిమాను ఈ వారం వరల్డ్ టెలివిజన్ప్రీమియర్‌గా అందిస్తోందనీ సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. అద్భుతమైన కథ, కథనంతో పాటు పూరీ జగన్నాథ్ డైరెక్షన్, రామ్ నట విశ్వరూపం తో డబుల్ ఇస్మార్ట్,ఈ నెల 27న సాయంత్రం 6 గంటలకు, మీ జీ తెలుగులో ప్రసారమవుతుందన్నారు. పూరీ జగన్నాథ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా కథ అంతర్జాతీయ మాఫియా డాన్ బిగ్ బుల్ (సంజయ్ దత్) చుట్టూ తిరుగుతుందన్నారు. అతని జ్ఞాపకశక్తిని మరొకరి మెదడుకు బదిలీ చేయడం వల్ల అతను అమరుడవుతాడని ఒక శాస్త్రవేత్త సూచించడంతో అందుకు సరిపోయే వ్యక్తి కోసం అన్వేషణ మొదలవుతుందన్నారు. ఆ అన్వేషణలో హైదరాబాద్ లోని శంకర్ (రామ్ పోతినేని)సరైన వ్యక్తిగా గుర్తించడంతో బిగ్ బుల్ మెమరీ ట్రాన్స్ ఫర్ జరుగుతుందన్నారు.ఆ తర్వాత ఏం జరుగుతుందనే విషయం తెలియాలంటే జీ తెలుగులో ప్రసారమయ్యే డబుల్ ఇస్మార్ట్ సినిమా చూడాల్సిందే అన్నారు. రామ్ పోతినేని, కావ్య థాపర్ జంటగా నటించిన ఈ సినిమాలో సంజయ్ దత్, గెటప్ శ్రీను, అలీ, షాయాజీ షిండే, ఝాన్సీ వంటి నటులు కీలక పాత్రలు పోషించారన్నారు. యాక్షన్, కామెడీ, థ్రిల్లింగ్ కాన్సెప్ట్‌తో రూపొందిన ఈ మాస్ఎంటర్టైనర్ని జీ తెలుగు వేదికగా ఈ నెల 27న మీరు తప్పకుండా చూడాలన్నారు.

రీ-సర్వే భూసమస్యలపై గ్రామసభ

విశాలాంధ్ర-చిల్లకూరు: మండలపరిధిలోని బల్లవోలు గ్రామంలో శుక్రవారం రీ-సర్వే కార్యక్రమంలో తలెత్తిన భూసమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక గ్రామ సభ తాహశీల్దారు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగింది. తెలుగుదేశం సీనియర్ నేత బల్లవోలు క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ గూడూరు శాసనసభ్యులు పాశం సునీల్ కుమార్ ఆదేశాలతో తాహశీల్దారు శ్రీనివాసులు గ్రామంలోని భూసమస్యలను పరిష్కరించేందుకు తమ సిబ్బందితో ఈ ప్రత్యేక గ్రామసభ ఏర్పాటు చేయడం జరిగిందని అని తెలిపారు. సాధ్యమైనంత త్వరగా సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. పలువురు గ్రామస్తులు తమ సమస్యలను గ్రామసభలో అధికారుల దృష్టి కి తీసుకుని వచ్చారు. సమస్యలను పరిశీలించి ఉన్నతాధికారుల సూచనలు తీసుకుని పరిష్కరించడం జరుగుతుంది అని తాహశీల్దారు తెలిపారు. ఈ గ్రామసభలో ఉప-సర్పంచ్ దువ్వూరు వినయ్ కుమార్ రెడ్డి, ఆర్ఐ, సర్వేయర్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే మురళీమోహన్

విశాలాంధ్ర-చిత్తూరు: రైతులకు ప్రధాన ఆదాయ వనరులుగా ఉన్న పశుసంవర్ధక రంగాన్ని మెరుగు పరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్ అన్నారు. శుక్రవారం బంగారుపాళ్యం మండలం నల్లగాంపల్లె గ్రామంలో పశుగణన కార్యక్రమంను మండల నాయకులు, అధికారులతో కలిసి శాసనసభ్యులు ప్రారంభించారు. అనంతరం అక్కడే నిర్వహించిన గోపూజలో పాల్గొన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ. గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు పశుసంపద ప్రధాన ఆదాయ వనరులుగా ఉందని, ముఖ్యంగా భూమి లేని రైతులు పశు సంపదపై ఆధారపడిన జీవనం సాగిస్తున్నారని, రైతులు ఆర్థికంగా పురోగతి చెందేందుకు రాష్ట్ర ప్రభుత్వం సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని, రైతులకు అవసరం అయ్యే విత్తనాలు, పరికాలను సబ్సిడీ క్రింద అందిస్తూ పాడి రైతుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బంగారుపాళ్యం మండల పార్టీ అధ్యక్షులు ఎన్.పి.జయప్రకాష్ నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి జనార్ధన్ గౌడ్, క్లస్టర్ ఇంఛార్జ్ ధరణీ నాయుడు జిల్లా, మండల అధికారులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలసిన అధికారులు

విశాలాంధ్ర-పలమనేరు: పలమనేరు శాసన సభ్యులు అమరనాథ రెడ్డిని పలమనేరు ఆర్డివో గా బదలీ పై వచ్చిన భవాని మరియు పలమనేరు హౌసింగ్ డీఈ గా బాధ్యతలు తీసుకున్న స్వామిదాస్ లు శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను మర్యాద పూర్వకంగా సన్మానించి నియోజకవర్గ పరిస్థితులపై చర్చించారు.

ఇసుక అక్రమ రవాణా జరక్కుండా ముందస్తు చర్యలు

విశాలాంధ్ర-ఏర్పేడు: ఇసుక అక్రమ రవాణా జరక్కుండా ఏర్పేడు మండలంలోని కొత్త వీరాపురం స్వర్ణముఖి నది ప్రాంతంలో తాసిల్దార్ భార్గవి అక్రమార్కులకు అడ్డుకట్ట వేయడానికి ట్రెంచ్ కొట్టారు. కొత్త వీరాపురం స్వర్ణముఖి నది ప్రాంతంలో కొంతమంది అక్రమార్కులు రాత్రి సమయంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారున్న విషయం గ్రామస్తుల ద్వారా తెలుసుకున్న తాసిల్దార్ రెవిన్యూ సిబ్బంది ఎక్స్ వేటర్ సహాయంతో అక్రమార్కులు స్వర్ణముఖి నదిలోకి దిగకుండా శుక్రవారం అడ్డంగా పెద్ద గోతి తీసి చర్యలు చేపట్టారు.. దీంతో అక్రమార్కుల గుండె గుబెల్ల మంది. సొంత అవసరాల నిమిత్తం ఇసుకను తీసుకెళ్లవచ్చని ప్రభుత్వం ప్రజలందరికీ ఉచిత ఇసుక పాలసీని అందించిందని చెప్పారు. సొంత అవసరాలకు కాకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తాసిల్దార్ భార్గవి అక్రమార్కులను హెచ్చరించింది.

మంగానెల్లూరులో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్

విశాలాంధ్ర-సూళ్లూరు పేట: స్విమ్స్, శ్రీ బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో శుక్రవారం పేర్నాడు పిహెచ్సి పరిధిలోని మంగానెల్లూరు సచివాలయంలో పింక్ బస్ ద్వారా ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో పింక్ బస్సుల ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా జరుగుతోంది. పింక్ బస్సులో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ కోసం మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కోసం పాప్ స్మియర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. అక్టోబరు 28న పేర్నాడు పిహెచ్ సి పరిధిలోని కోటపోలూరు-2లో, అక్టోబరు 30న రామాపురం పిహెచ్ సి పరిధిలోని పెరియవెట్టులో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఐ.రమణయ్య, స్విమ్స్ శ్రీ బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి.హరిత, సర్పంచ్ శేఖర్ సచివాలయ కార్యదర్శి వసంత కుమార్, స్థానిక నాయకులు నారాయణరెడ్డి, సుధాకర్ రెడ్డి, హెచ్ఇఓ రవికుమార్, సూపర్వైజర్ చిన్నస్వామి, ఎల్ హెచ్ పి కె.మేఘన, ఏఎన్ఎం బి.శ్రీదేవి, హెల్త్ అసిస్టెంట్ శీనయ్య, నర్సింగ్ సిబ్బంది, స్థానిక వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఏకంగా వీధి సిసి రోడ్డే కబ్జా

విశాలాంధ్ర-గుడిపాల: గుడిపాల మండలం లోని అనుపు ఎస్టీ కాలనీ గ్రామంలో ఓ వ్యక్తి ఏకంగా వీధి సిసి రోడ్డునే కబ్జా చేసి ఏంచక్కా ఇంటికి ప్రహరీ గోడ నిర్మించు కోవడం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది, గ్రామంలో అందరూ షెడ్యూల్ తెగకు చెందిన వారు ఉండడంతో సమస్యను పరిష్కరించే దిశలో గ్రామస్తులు ఆ వ్యక్తికి చెప్పి చూశారు అయినా వారిని పట్టించుకోక యదేచ్ఛగా తమ పనిని కానించుకోవడంతో గ్రామస్తులు సహించలేక మండల తాసిల్దార్ వారి కార్యాలయమునకు ఈ శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందిన వెంటనే తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి స్పందిస్తూ కబ్జా చేసి కాంపౌండ్ వాల్ నిర్మిస్తున్న ఆ వ్యక్తిని మందలించి వెంటనే పనిని ఆపాలని మేము సర్వే చేసి ఇచ్చేవరకు ఎలాంటి కార్యకలాపాలు చేయకూడదని హెచ్చరించారు.

ప్రజల నుండి అర్జీలను స్వీకరించిన కలెక్టర్ సుమిత్ కుమార్

విశాలాంధ్ర-కుప్పం: శుక్ర వారం కుప్పం ఎంపిడి ఓ కార్యాలయంలో ప్రజల సమస్యల పరిష్కారం కొరకు ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ప్రజల నుండి అర్జీలను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ స్వీకరించారు. జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ జి. విద్యాధరి, కడ ప్రాజెక్టు అధికారి వికాస్ మర్మత్ లు ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ప్రజల నుండి అందుతున్న అర్జీలను సంబంధిత శాఖలకు ఎండార్స్మెంట్ ఇస్తూ పరిష్కరించాలని జిల్లా కలెక్టర్, జెసి, కడ పిడిలు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టిసి వైస్ చైర్మన్ మునిరత్నం, వివిధ సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు టైలరింగ్ శిక్షణ

విశాలాంధ్ర-చిల్లకూరు: జిందాల్ విద్యుత్ పరిశ్రమ యాజమాన్యం తమ సామాజిక బాధ్యత లో భాగంగా మహిళలకు, మహిళా సాధికారత మరియు నైపుణ్యాభివృద్ధిలో భాగంగా శుక్రవారం తమ్మినపట్నం గ్రామంలో టైలరింగ్ శిక్షణ కేంద్రం ప్లాంటు హెడ్ కే. శ్రీనివాసరావు చేతుల మీదుగా ప్రారంభించారు. తమ్మినపట్నం, లింగవరం, మోమిడి మరియు వరగలి గ్రామాలనుండి 40మంది మహిళలకు 45 రోజుల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధులు విల్సన్, జోబిన్ మాత్యూ, శ్రీకాంత్, ఖలీద్ తదితరులు పాల్గొన్నారు.

ముత్తు రామలింగం జయంతిని జరుపుకోవడం ఆనందదాయకం

- ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్

విశాలాంధ్ర -కుప్పం: కల్లర్ మరవర్ అగముడియార్, పిరమాలై కల్లర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం అంబికా విశ్వనాథ కళ్యాణ మండపంలో నిర్వహించిన శ్రీ పసుంపొన్ను ముత్తు రామలింగం దేవర్ జయంతి వేడుకకు ముఖ్యఅతిథిగా తెలుగుదేశం పార్టీ కుప్పం నియోజకవర్గ సమన్వయ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, మున్సిపాలిటీ అధ్యక్షులు రాజకుమార్, కౌన్సిలర్ సోము, సురేష్, సత్యేంద్ర శేఖర్, వెంకటేష్ అర్ముగం, జనసేన నేత బివి నరేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ శ్రీ పసుంపొన్ను ముత్తు రామలింగం దేవర్ స్వతంత్ర పోరాట సమరయోధుడని అలాంటి స్వతంత్ర సమరయోధుల జయంతిని జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. స్వతంత్రం వచ్చాక రాజకీయాల్లో చురుగ్గా పాల్గొని ప్రజలకు సేవలు అందించారన్నారు. ఆయన తండ్రి వారసత్వంగా వచ్చిన 600 ఎకరాల పంట భూములను పేద బడుగు, బలహీన, వర్గాలకు దాన దత్తం చేయడం గొప్ప విషయం అన్నారు. కల్లర్ మరవర్ అగముడియార్, పిరమాలై కల్లర్ సంక్షేమ సంఘం సభ్యులు, టిడిపి, జనసేన, బిజెపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యమా... అధికారులు నిర్లక్ష్యమా..

విశాలాంధ్ర-గుడిపాల: గుడిపాల మండలంలోని ఈ శుక్రవారం జరిగిన గ్రామసభలలో భాగంగా మండల హెడ్ క్వార్టర్ వసంతాపురం రెవిన్యూ గ్రామంలో చేపట్టిన గ్రామసభలకు రీసర్వే లో పెద్ద ఎత్తున వినతుల వెల్లువ, ఈరోజు జరిగిన వసంతాపురం గ్రామసభలలో ఓ రైతు జి సుబ్రహ్మణ్యం రెడ్డి ఆవేదన వెల్లడించారు, నాగున్న పాత పాసు పుస్తకం పూర్తి విస్తీర్ణం 6.06 ఎకరములు ప్రస్తుతం 5.28 ఎకరములు వ్యత్యాసము ప్రస్తుత రీ సర్వే పుస్తకము ప్రకారము 0.78 ఎకరములు, రీ సర్వే అయిన తరువాత ప్రతి ఒక్క రైతు సమస్య ఇలానే ఉన్నది. కావున ఇక నైనా అధికారులు స్పందించి లోపాలను ఈ గ్రామ సభలలోనైనా చేదించ గలరు అని ఆవేదన వెల్లడించారు, దీనిపై స్పందిస్తూ తహసిల్దార్ అందిన అర్జీలకు సాధ్యమైనంత త్వరలో పరిష్కరిస్తామని తహసిల్దార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, రీ సర్వే డిప్యూటీ తాసిల్దార్ రూప రాణి, ఆర్.ఐ రామ సాయి, మండల సర్వేయర్ గోపి, కమ్యూనిటీ సర్వేయర్ కిరణ్, వీఆర్వో హరినాద్ రెడ్డి, గ్రామ సర్వేయర్ పి భాను ప్రకాష్, గ్రామా సర్పంచ్ యన్ రజిని కాంత్, మరయు రెవిన్యూ సిబ్బంది రైతులు పాల్గొన్నారు,

ఇన్-చార్జిలతో కుంటుపడుతున్న పాలన

విశాలాంధ్ర-బాలాయపల్లి: మండలంలోని వెలుగు కార్యాలయంలో గత రెండేళ్లుగా ఎపియం లేకపోవడంతో ఇంచార్జ్ ల పాలన కొనసాగుతుంది. పక్క మండలాలు కు చెందిన ఎపియంలను ఇన్చార్జిలను నియమమించడంతో వారు బాలాయపల్లి కార్యాలయం కు రాకుండా స్థానికంగా పని చేస్తున్న సీసీ లకు భాధ్యతలు అప్పచెప్పి పనులు చక్కబెట్టడం పరిపాటిగా మారింది. దీంతో మండలంలోని పొదుపు సంఘాల సభ్యులు తమ సమస్యలు చెప్పుకునేందుకు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. అంతేకాకుండా ఎపియం లేకపోవడంతో సీసీలు ఇష్టారాజ్యంగా వారొచ్చిందే సమయం చేసిందే పని అన్నట్లు వ్యవహరిస్తున్నారని, క్షేత్ర స్థాయిలో పనిచేయాల్సిన సీసీ లు మధ్యాహ్నం 12కి ఆఫీస్ కి వచ్చి మధ్యలోనే వెళ్లిపోతున్నారు. ఇకనైనా పూర్తి స్థాయిలో ఎపియం ను నియమించాలని పొదుపు సంఘాల సభ్యులు కోరుతున్నారు.

త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు సేవలు

ఎమ్మెల్యే గురుజాల జగన్మోహన్

విశాలాంధ్ర-చిత్తూరు: రాష్ట్ర ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ధ్యేయం గా ప్రభుత్వం పనిచేస్తుందని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. శుక్రవారం చిత్తూరు ఆర్టీసీ బస్టాండులో ఏడు ఆర్టీసీ బస్సు సర్వీసులను ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడిచిన ఐదు నెలలో చిత్తూరులో 27 బస్సులు ప్రారంభించడం జరిగిందని.. నేడు ఆరు నూతన సర్వీసులు, ఒక టౌన్ సర్వీసును ప్రారంభించడం జరిగిందన్నారు. అడిగిన వెంటనే చిత్తూరుకు ఆర్టీసీ బస్సులు కేటాయించిన ముఖ్యమంత్రికి, రాష్ట్ర మంత్రి రాంప్రసాద్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలలోనే ప్రజల సౌకర్యార్థం చిత్తూరులోనే 33 బస్సులను ప్రారంభించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా బస్సు సర్వీసులకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఆర్ఎం జగదీష్, ఆర్టీసీ డిపోల మేనేజర్లు కృష్ణమూర్తి, రూపశ్రీ, ఆర్టీసి సిబ్బంది, మేయర్ అముద, మాజీ ఎమ్మెల్సీ రాజసింహులు, మాజీ మేయర్ కటారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్ర కుమార్, సీనియర్ నాయకులు వసంత్ కుమార్, ఉమ్మడి పార్టీల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లారీ బస్సు ఢీ.. డ్రైవర్‌కి గాయాలు

విశాలాంధ్ర-రేణిగుంట: పూతలపట్టు నాయుడుపేట జాతీయ రహదారిలోని రేణిగుంట మండలం తూకివకం గ్రామం వద్ద శుక్రవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. వేగంగా వెళ్తున్న కంటైనర్ లారీ తమిళనాడుకు చెందిన బస్సు ఢీకొనడంతో బస్ డ్రైవర్ కు తీవ్ర గాయాలయ్యాయి. బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఘటన స్థలానికి చేరుకున్న గాజుల మండ్యం పోలీసులు 108 వాహనంలో డ్రైవరును ఆసుపత్రికి తరలించారు.

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం: ఎమ్మెల్యే బొజ్జల

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరమని శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి పట్టణం, శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాలకు చెందిన 12మందికి శుక్రవారం రూ. 11,60,402లు ముఖ్యమంత్రి సహాయనిధి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి మాట్లాడుతూ... వివిధ అనారోగ్యాలతో ఆస్పత్రిలో చికిత్స పొందిన పేదలకు ఈ ముఖ్యమంత్రి సహాయనిధి అందచేస్తున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇలా సాయం చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. పేదలకు అండగా నిలిచిన ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ కు ఆయన కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు పెద్ద కనపర్తి విద్యార్థులు

విశాలాంధ్ర-తొట్టంబేడు: తొట్టంబేడు మండలం పెద్ద కనపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ఆర్ పీబీఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల జరిగిన యోగా పోటీల్లో పెద్ద కనపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న సి.మీనాక్షి విశేష ప్రతిభ కనబరచింది. దీంతో ఆ విద్యార్థిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వచ్చే నెలలో నెల్లూరు జిల్లాలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈ బాలిక పాల్గొనసుంది. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన మీనాక్షిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.సుబ్రహ్మణ్యం, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.చెంగ్రాయులు, ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు అభినందించారు.

అధికారులు ప్రజాప్రతినిధుల కృషితో అభివృద్ధికి జీవం

విశాలాంధ్ర-చంద్రగిరి: అధికారులు ప్రజాప్రతినిధుల కృషితో చంద్రగిరి నియోజకవర్గంలో అభివృద్ధికి జీవం పోద్దామని ఎమ్మెల్యే పులివర్తి నాని పిలుపునిచ్చారు. చంద్రగిరి ఎంపిడిఓ కార్యాలయంలో అధికారులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపిడిఓ కార్యాలయానికి విచ్చేసిన ఎంఎల్ఏకు ఎంపీపీ మావిళ్ళ హేమేంద్ర కుమార్ రెడ్డి, ఎంపిడిఓ శేఖర్, ఎమ్మార్వో శివరామ సుబ్బయ్య, నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ముందుగా పశువుల ఆసుపత్రిలో 2వ అఖిల భారత పశుగణన పోస్టర్ను ఆవిష్కరించారు. అనంతరం ఎంపిడిఓ సమావేశ మందిరంలో కొత్తగా బదిలీపై వచ్చిన వారితో పాటు అధికారుల అందరిని పరిచయం చేసుకున్నారు. మండల పరిధిలోని పంచాయతీలో వున్న సమస్యలను అధికారులు, పంచాయతీ కార్యదర్శుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు తల్లి నేను సుబ్రహ్మణ్యం నాయుడు, చిత్తూరు పార్లమెంటు ఉపాధ్యక్షులు గౌస్ బాషా, జడ్పిటిసి మాజీ సభ్యులు వీరంగారి రమేష్ రెడ్డి, సీనియర్ నాయకులు మొక్కల కుమార్ రాజారెడ్డి, దుబాసి రామ్మూర్తి, నక్కురు ధనంజయ రెడ్డి, మానికొండ కన్నయ్య నాయుడు, మండల స్థాయి వివిధ శాఖల అధికారులు, పాత, కొత్త పంచాయతీ కార్యదర్శులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఎస్వి మార్ట్ షాపింగ్ మాల్ ప్రారంభం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: పట్టణంలోని పానగల్ రోడ్డు పొన్నాలమ్మ ఆలయ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్వి మార్ట్ షాపింగ్ మాల్ను శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి పట్టణ గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఎస్వి మార్ట్ షాపింగ్ మాల్ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. శ్రీకాళహస్తి ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్ట్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

అధికంగా వర్షం కురవడం వల్ల పొంగుతున్న బోరు నీరు

విశాలాంధ్ర-సోమల: సోమల మండలం సోమల పంచాయతీ మినిరెడ్డి రెడ్డి గారి పల్లి బాలాజీ అనే రైతు తన పొలంలో గత కొద్దిరోజుల క్రితం సాగునీరు కొరకు 520 అడుగుల లోతులో బోరు వేయడం తో నీటి కోసం బాధలు తప్పాయి. రైతు వేసిన బోరు బావి లోగత కొద్దిరజులుగా కురుస్తున్న తుఫాన్ తో భూమి సారవంతం అవడం వలన బోరు బావి లో 3 రోజు ల నుండి గంగా దేవి ఎలాంటి చర్యలు లేకుండా వాటి అంతట ఆ బోరు నుండి నీరు పెల్లుబికి బయటికి రావడం తో సొంతం గా వున్నారు.

అనువైన ఎరువులను వాడాలి

విశాలాంధ్ర-పాకాల: రైతులు అధిక పంట దిగుబడులకై తమ నేలకు అనువైన ఎరువులను ఉపయోగించాలని వ్యవసాయ శాఖ జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం పాకాల మండలంలోని కే వడ్డేపల్లి గ్రామ పంచాయతీలో సర్పంచ్ కే.వరలక్ష్మి అధ్యక్షతన రైతు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిఆర్సి వ్యవసాయ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు భూసార పరీక్ష ఫలితాలను అనుసరించి సమతుల ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగులు సాధించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు కౌశిక్, రైతులు పాల్గొన్నారు.

హెూంగార్డ్స్ పిల్లలకు మెరిట్ స్కాలర్‌షిప్‌లను అందజేసిన ఎస్పీ

విశాలాంధ్ర -చిత్తూరు : జిల్లాకు చెందిన హెూంగార్డు పిల్లలకు జిల్లా ఎస్పీ మణికంఠ చందర్ మెరిట్ స్కాలర్షిప్ లను అందజేశారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాల యములోని కాన్ఫరెన్స్ హాల్ నందు చదువులో ప్రతిభ కనబరిచిన 18 మంది హెూం గార్డ్స్ పిల్లలకు మెరిట్ స్కాలర్షిప్ చెక్కులను ఎస్పీ అందజేసారు. ఈ సందర్భముగా ఎస్పీ వి.ఎన్. మణికంఠ చందోలు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల విద్యకు ప్రోత్సాహం కల్పించడం, వారి భవిష్యత్తు పురోగతికి సహకరించడం ప్రధాన లక్ష్యం అని హెూమ్ గార్డ్స్ తమ కుటుంబాన్ని, పిల్లలను ఉత్తమమైన విధంగా నడిపిం చడానికి ఎంతో కష్టపడుతున్నారని, వారి పిల్లల విద్యాభ్యాసానికి ఆర్థిక సాయం అందిం చడం సంతోషంగా ఉందని తెలిపారు. హెూమ్ గార్డ్స్ వంటి సిబ్బంది సమాజంలో శాంతి భద్రతలను కాపాడడంలో, ప్రజలకు అండగా నిలవడంలో ఎంతో కృషి చేస్తున్నారు. వారికి సంబంధించిన కుటుంబ సభ్యులకు, ముఖ్యంగా పిల్లలకు విద్యకు ప్రోత్సాహం ఇవ్వడం వారి త్యాగానికి, సేవకు గౌరవం తెలియజేయడమేనని ఎస్పీ పేర్కొన్నారు. ఈ స్కాలర్షిప్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, విజ్ఞానం ప్రతిభను పెంపొం దించుకోవాలని ఎస్పీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఆర్ అడిషనల్ ఎస్పీ ఆర్. శివానంద కిషోర్, ఏ.ఆర్డి.ఎస్పీమహబూబ్ బాషా, ఎస్.బి. ఇన్స్పెక్టర్ భాస్కర్, ఆర్.ఐ. అడ్మిన్‌సుధాకర్, ఆర్.ఐ. ఎంటిఓ భాస్కర్ హెూంగార్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో డైరెక్టరు ఆఫ్ జనరల్ అకౌంటెంట్

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం న్యూఢిల్లీ డైరెక్టరు ఆఫ్ జనరల్ అకౌంటెంట్ కె.సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులతో కలసి దర్శి ంచుకున్నారు. ఆలయ డిప్యూటీ ఈవో ఎన్ఆర్ కృష్ణారెడ్డి ఈయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లుచేశారు. దర్శనానంతరం మృత్యుంజయ స్వామి సన్నిధిలో ఆలయ పండి తులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అంద జేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బాలికల పాఠశాలను తనిఖీ చేసిన పుత్తూరు జడ్జి రాఘవేంద్ర

విశాలాంధ్ర - పుత్తూరు టౌన్ : నారాయణ వనం మండలం కేంద్రములోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి ఎస్ సి రాఘవేంద్ర గురువారం మధ్యాహ్నం భోజనాలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి రుచి చూశారు సంతృప్తి వ్యక్తం చేశారు విద్యార్థులకు ప్రభుత్వ బాలికల పాఠశాలలో అందించే భోజనం పై సంతోషం వ్యక్తం చేశారు వంటగదిని నిత్య అవసర సరుకులను చాలా క్షుణ్ణంగా పరిశీలించారు అదే విధంగా విద్యార్థులకు పరిశుభ్రంగా శుభ్రంగా ఉండే ఆహారాన్ని అందించాలని ప్రధానో పాధ్యాయురాలు శశికళకు సూచించారు ఈ కార్యక్రమంలో నారాయణవనం ఏఎస్ఐ జయరాం నాయక్ కోర్టు కానిస్టేబుల్ ముని శేఖర్ ప్రభుత్వ బాలికల పాఠశాల ఉపాధ్యా యులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 14న రాష్ట్ర వ్యాప్తంగా

మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ కార్యక్రమం

విశాలాంధ్ర- తిరుపతి : పలు విద్యా సంబంధిత అంశాలపై విజయవాడ నుండి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ సెక్రటరీ కోన శశిధర్ కమిషనర్ స్కూల్ ఎడ్యుకేషన్ విజయ రామ రాజు, సమగ్ర శిక్ష ఎస్పిడి శ్రీనివాసరావు తదితర అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వర్చువల్ విధానంలో సమీక్షించి దిశా నిర్దేశం చేయగా తిరుపతి జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ డాక్టర్.ఎస్.వెంకటేశ్వర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు అన్నింటిలో అపార్ (ఆటోమేటెడ్ పర్మనెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) ఐడి జనరేట్ చేయడం అనే కొనసాగుతున్న కార్యక్రమం త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకో వాలని తెలిపారు. ఈనెల నవం బర్ 14న జరగనున్న మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ కొరకు ముందస్తుగా చేపట్టాల్సిన కార్యాచరణపై ప్రోగ్రెస్ రిపోర్ట్ తయారీ, ఫార్మేటివ్ అసెస్మెంట్ వన్, టూ లకు సంబం ధించిన ప్రోగ్రెస్ కార్డు తయారు చేసుకోవడం, విద్యా ర్థుల అవగాహన సామర్థ్యం ప్రగతి, విద్యా స్థాయి పురోగతిపై, పాఠశాల అభివృద్ధిపై సదరు సమావేశంలో చర్చిం చాల్సి ఉంటుందని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పేరెంట్ టీచర్ లు పాల్గొని సదరు అంశాలను చర్చించాలి అని తెలిపారు. నవంబర్ లో మెగా డీఎస్సీ ప్రక్రియ కొనసాగుతుందని, దానికి సంబం ధించిన ఖాళీల వివరాలను, రూల్ ఆఫ్ రిజర్వేషన్ తదితర అంశాలను నిబంధనల మేరకు సిద్ధం చేసుకోవాలని సూచించారు. జిల్లాకలెక్టర్ మాట్లాడుతూ నిబంధనల మేరకు అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పశు గణన సర్వేకు వచ్చే ఎన్యూమరేటర్‌కు ప్రజలు సహకరించాలి

పశు గణన సర్వే జిల్లాలో పక్కాగా నిర్వహించాలి : కలెక్టర్

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ : 21వ అఖిల భారత జాతీయ పశు గణన కార్యక్ర మం -2024 ను తిరుపతి జిల్లాలో పశు సంవర్ధక శాఖ కార్యదర్శి ఎంఎం నాయక్, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంక టేశ్వర్ తో కలిసి ప్రారంభించి పశు గణన సర్వే కు వచ్చే ఎన్యూమరేటర్ కు ప్రజలు పూర్తి సమాచారం అందించి సహకరిం చాలని, పశు గణన సర్వే పక్కాగా నిర్వహిం చాలని వారు సంయుక్తంగా అన్నారు. శు క్రవారం తిరుపతి రూరల్ మండలం,చిగురువాడ పంచాయితీ సొత్ కండ్రిగలో ఏర్పాటు చేసిన 21వ అఖిల భారత జాతీయ పశు గణన కార్యక్రమం -2024 కార్యక్రమంలో రాష్ట్ర పశు సంవర్ధక శాఖ కార్యదర్శి, జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి పాల్గొ న్నారు. రాష్ట్ర పశు సంవర్ధక శాఖ కార్యదర్శి మాట్లాడుతూ వ్యవసాయం ఎంత ముఖ్యమో పశు సంపద కూడా అంతే ముఖ్యం అని,అందుకే పాడి- పంట అని అంటారు అని అన్నారు. పాడి పశు వులు, పెంపుడు జంతువులు మన దైనందిన జీవితంలో ఒక భాగం అయ్యాయని తెలిపారు. రాబోయే కాలంలో పశు సంపద ఎంతగా ప్రోత్సహిస్తే మనకు అంత అదనపు ఆదాయం వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమం దేశం మొత్తం మీద జరుగుతున్న పశు గణన అని,16రకాల జంతువులను గణన చేయనున్నామని అన్నా రు. రాష్ట్ర వ్యాప్తంగా 14 వేల మంది పశు సంవర్ధకా శాఖ సిబ్బంది ఉన్నారని,ఈ సర్వే లో రాష్ట్ర వ్యాప్తంగా 5500 మంది ఎన్యూమ రేటర్లు,1200 సూపర్వైజర్లు పాల్గొంటున్నారని తెలిపారు. గత పశు గణనలో తెలిసిందేమంటే పాడి పశువుల శాతం పెరిగిందని తెలిపారు. ఈ పదు గణన సర్వే పక్కాగా పటిష్టంగా నిర్వహించాలని అన్నారు. పశు సంవర్ధక శాఖలోని సిబ్బంది గ్రామాల్లో పాడి రైతులకు చెందిన పశువులకు పుట్టినప్పటి నుండి వాటికి క్యాలెండర్ టైం లైన్ మేరకు పక్కాగా వాక్సినేషన్ చేస్తే వాటికి ఎలాంటి రోగాలు రాకుండా కాపాడుకోవచ్చని అన్నారు. పాడి రైతులకు అవసరమైన అన్ని సేవలు ఎప్పటికప్పుడు గ్రామాల్లో అందుబాటులో ఉండి అందించాలని సూచించారు. పాడి పరిశ్రమ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 21వ అఖిల భారత పశుగణన 2024 కార్యక్రమం నేటి నుండి అనగా ఈనెల 25 అక్టోబర్ నుండి 28ఫిబ్రవరి 2025 వరకు చేపడుతున్న నేపథ్యంలో వచ్చే విషయ సేకరణ దారుడికి పశువుల సమగ్ర సమాచారం అందించి సహకరించాలని, తద్వారా పశు గణన రంగ పథకాల రూపక ల్పనలో సదరు సమాచారం ఎంతగానో ఉపయోగ పడుతుంది అని తెలిపారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో రాష్ట్ర పశుసంవర్ధక శాఖ సెక్రటరీతో కలిసి ప్రారంభించుకోవడం ఎంతో సంతోషంగా ఉందనీ,నేటి నుండి దేశ వ్యాప్తంగా 21వ అఖిల భారత పశు గణన 2024 అన్ని గ్రామాలలో ప్రారంభం అయిందని అన్నారు. ప్రతి కుటుంబంలో ఉన్న పశువులు ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పౌల్ట్రీ తదితర పశు సంపద కు సంబంధించిన వివరాలు సేకరించడానికి శాఖ తరపున ఒక ఎన్యుమరేటర్ వస్తారని, వివరాల సేకరణ అనంతరం సదరు ఇంటి గోడపై స్టికర్ మార్కింగ్ చేయడం జరుగుతుందని తెలిపారు. వీధిలో తిరుగుతున్న పశువులు, కుక్కలు తదితర పశువుల వివరాలు కూడా సేకరిస్తారని తెలిపారు. ఈ సర్వే కొరకు జిల్లాలో 472 మంది ఎన్యుమరేటర్ లను, 77 మంది సూపర్వైజర్లను నియమించడం జరిగిందని అన్నారు. ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి జన గణన చేస్తారు అనేది మీకు తెలిసిందే అని తెలుపుతూ, అదే విధంగా ఐదు సంవత్సరాలకు ఒకసారి మన ఇంటి వద్ద పెంచుకునే కోళ్లు,ఆవులు, గేదెలు పశువులు వాటి వివరాలు ఎన్యూమరేటర్ ఇంటింటికీ తిరిగి పశు గణన వివరాలను యాప్ నందు నమోదు చేస్తారని తెలిపారు. దేశ వ్యాప్తంగా నిర్వహించే ఈ సర్వే ద్వారా పశు సంపద పై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పాడి పశువుల సంక్షేమం కోసం అనేక పథకాల రూపకల్పనకు ఎంతగానో ఉపకరిస్తుందని తెలిపారు. ఎస్వీ పశు వైద్య కళాశాల రిజిస్ట్రార్ రవికుమార్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి వచ్చే ఎన్యూమరేటర్ పెంపుడు జంతువులు కోళ్లు,గేదెలు, ఆవులు తదితర వివరాలు పూర్తి సమాచారం సేకరిస్తారని వారికి సరైన సమాచారం అందిస్తే ప్రభుత్వం తయారు చేసే ప్రణాళికలకు ఎంతగానో ఉపకరిస్తుందని తెలిపారు. ఎంపీటీసీ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పాడి రైతుల అభివృద్ధికి కట్టుబడి ఉందని తెలిపారు. గోమాతను మనం కాపాడుకోవాలని కోరారు. సమావేశం అనంతరం ఎన్యూమరేషన్ కరదీపికను, వివరాల సేకరణ అనంతరం అతికించే స్టికర్ లను,ఐడీ కార్డులను ,పోస్టర్లను,కర పత్రాలను,కిట్ బ్యాగ్ ను వారు సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కేశవులు రెడ్డి,కేశవులు రాయల్, భాస్కర్ యాదవ్,మల్లీశ్వర్ రెడ్డి,మురళి, పాడి రైతులు పాల్గొన్నారు.

105వ ఏఐటియుసి ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించండి

విశాలాంధ్ర - తిరుపతి : కార్మిక సమస్యల పరిష్కారంలో రాజీలేని పోరాటాలు నిర్వహించే ఎర్రజెండా దేశంలోనే మొదటి అగ్రగామి కార్మిక సంఘం ఏఐటియుసి.జెండాలు ఎగురవేసి సభలు సమావేశాలు జరిపి కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మిక వర్గాన్ని కదిలిద్దాం - సమర శంఖం పూరిద్దాం. ఏఐటీయూసీ తిరుపతి జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం జిల్లా అధ్యక్షులు ఎన్ చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన. ఏఐటి యు సి జిల్లా కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి ఏఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు రామచంద్రయ్యలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 105 సంవత్సరాల చరిత్ర కలిగిన ఏఐటియుసి స్వాతంత్ర పోరాటంలోనూ బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా భారతదేశ స్వాతంత్రం కోసంఅనేక పోరాటాలను నడిపిండి విజయం సాధించిన చరిత్ర ఏఐటియుసి అని వారు కొనియాడారు. దేశంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను ప్రజా వ్యతిరేక విధానాలను అమలుపరుస్తూ పెట్టుబడిదారులకు ఉపయోగపడే విధానాలను అనుసరిస్తున్నా యని అందువల్ల దేశంలో కార్మిక వర్గం కట్టు బానిసలుగా మారిపోయే ప్రమాదం ఉందని బ్రిటిష్ కాలం నుండి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దుపరిచి నాలుగు లేబర్ కోడ్ ల రూపంలో కార్మిక వర్గాన్ని పెట్టుబడిదారులకు కట్టు బానిసలుగా చేసే ప్రయత్నం కేంద్ర ప్రభుత్వం చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం తానా తందానా అంటూ తలలు ఊపుతున్నాయని. పార్లమెంటులో చేతులెత్తుతున్నాయని వారు అన్నారు. ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కారు చౌకగా అమ్మే ప్రయత్నం చేస్తున్నారు. పెద్ద పెద్ద చదువులు చదివి ఉద్యోగాలు లేక ఉపాధి లేక ప్రైవేట్ ట్రాన్ పోర్ట్ పై ఆధారపడి ఆటోలు టాక్సీలు ప్రైవేట్ ఫైనాన్స్ వద్ద తీసుకొని ఈ అమ్మాయిలు చెల్లించలేక అనేక అష్ట కష్టాలు పడుతున్న కార్మిక వర్గంపై నూతన క్రిమినల్ చట్టాలు పేరుతో. విపరీతమైన పెనాల్టీలను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం చట్టాలను తీసుకువస్తుంది ఇది చాలదన్నట్టు రాపిడో లాంటి సంస్థలకు విచ్చలి విడిగా అనుమతులు ఇస్తూ ప్రైవేట్ ట్రాన్స్పోర్ట్ రంగాన్ని నిర్వీర్యం చేస్తుంది ఇలా చెప్పుకుంటూ పోతే అనేకం ఉన్నాయి. అందుకే 105వ ఏఐటియుసి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని వాడవాడలలో జెండాలు ఎగరవేసి సమావేశాలు సభలు జరుపుకొని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై సమర శంఖం పూరించడం కోసం కార్మిక వర్గాన్ని కదిలించి సమర శంఖం పూరించి ఉద్యమాలకు ఊపిరి పోస్తూ కార్మిక వర్గం సత్తా చాటాల్సిన సమయం ఆసన్నమైందని అందుకు ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని కార్మిక వర్గాన్ని కదిలించి పోరాటాలకు పదును పెట్టి ఉద్యమాలను ఉధృతం చేస్తాం అని అన్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ జిల్లా అధ్యక్షులు ఎన్ చంద్రశేఖర్ రెడ్డి ఆఫీస్ బేరర్స్ శ్రీరాములు ఎన్ డి రవి కేవైరాజా సత్యనారాయణ శివ.వైఎస్ మణి. జాన్. తదితరులు పాల్గొన్నారు.